

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | బుధవారం 09-09-2026 | సంపుటి - 31 | సంచిక - 107 | రూ : 4 | పేజీలు: 8


# ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌కుమార్‌రెడ్డిలపై సస్పెన్షన్ వేటు

## రెండోరోజూ కొనసాగిన ఉద్రిక్తత

- స్పీకర్‌పై భారాస ఎమ్మెల్సీ వ్యాఖ్యలతో శాసనసభ బయట, లోపల వివాదాల పరంపర
- స్పీకర్ ఓఎస్డీ ఫిర్యాదు మేరకు ఎమ్మెల్సీలిద్దరి అరెస్టు
- నా తల్లిని మీ ఎమ్మెల్సీ అవమానించారంటూ హరీశ్‌పై సభాపతి ప్రసాద్‌కుమార్ ఆగ్రహం
- మరోవైపు ఎర్రవల్లిలో డప్పులతో దళిత సంఘాల నిరసన



- అక్కడికి బయలుదేరిన కేటీఆర్, హరీశ్, భారాస నేతల్ని మార్గంలోనే అడ్డుకున్న పోలీసులు

హైదరాబాద్: శాసనసభ, మండలి సమావేశాల రెండోరోజు మంగళవారం కూడా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. స్పీకర్‌పై భారాస ఎమ్మెల్సీ తాతా మధు చేసిన వ్యాఖ్యలపై సభ లోపల, బయటా కూడా వివాదం కొనసాగింది. 'స్పీకర్‌ను దుర్భాషలాడటమే కాదు.. తరువాయి 2లో



## పోలీసు ఉద్యోగాలకు దరఖాస్తు గడువు పెంపు

- ఈ నెల 16 వరకు అవకాశమిస్తూ ఉత్తర్వుల జారీ

హైదరాబాద్: తెలంగాణ పోలీసు నియామక మండలి చేపట్టిన ఉద్యోగాలకు దరఖాస్తు గడువును పెంచారు. ఈ నెల 9వ తేదీతో వ్యవధి ముగుస్తుండగా 16 వరకు పొడిగిస్తున్నట్లు నియామక మండలి ఛైర్మన్ వి.వి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన తరువాయి 2లో

## వచ్చే ఏడాదే బుల్లెట్ రైలు పరుగులు.. రైల్వే మంత్రి కీలక ప్రకటన



- వచ్చే ఏడాది మే, జూన్‌లో బుల్లెట్ రైలు ట్రయల్స్
- 2 నుంచి 4 నెలల తర్వాత అధికారికంగా ప్రారంభం
- తొలి బాడీ ఫ్రేమ్ ఇప్పటికే సిద్ధమైందన్న అశ్వినీ వైష్ణవ్
- సూరత్-వాపి మార్గం డిసెంబరులో పూర్తయ్యే అవకాశం
- గంటన్నరలో ముంబై నుంచి వడోదరకు 2లో

## నా వడోదరా అద్భుతం.. ప్రధాని మోదీ భావోద్వేగం

- వడోదరా ప్రజలు చేపట్టిన స్వచ్ఛతా కార్యక్రమంపై ప్రధాని ప్రశంసలు
- స్వచ్ఛతను పండగల స్ఫూర్తితో కొనసాగించాలని ప్రజలకు పిలుపు
- వడోదరాను మళ్లీ అపరిశుభ్రం కానివ్వబోమని సంకల్పం తీసుకోవాలన్న మోదీ
- పర్యటనలో భాగంగా రూ.35,000 కోట్లకు పైగా విలువైన ప్రాజెక్టులకు శ్రీకారం



- మోదీ కార్యక్రమానికి బుక్‌మైషో ద్వారా రిజిస్ట్రేషన్లు.. గంటలోనే సీట్లు ఫుల్

గుజరాత్‌లోని వడోదరా నగరవాసులపై ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసల వర్షం కురిపించారు. తన పర్యటనకు స్వాగతంగా తరువాయి 2లో




## డైమండ్ సిటీ జోరు..

వినియోగంలో బెంగళూరును, ఆదాయంలో హైదరాబాద్‌ను దాటేసిన సూరత్

- ఆరు మెట్రో నగరాల తర్వాత దేశంలోనే అతిపెద్ద వినియోగ మార్కెట్‌గా సూరత్
- వినియోగంలో బెంగళూరును, ఆదాయంలో హైదరాబాద్, చెన్నైలను దాటేసిన వైనం
- వేగంగా అభివృద్ధి చెందుతున్న 'బూమ్‌టౌన్' నగరాల జాబితాలో చోటు
- టెక్స్‌టైల్, డైమండ్ వ్యాపారాలతో దూసుకుపోతున్న గుజరాత్ నగరం
- వారాంతాల్లో రెట్టింపు కన్నా ఎక్కువగా ఖర్చు చేస్తున్న సూరత్ ప్రజలు 2లో



## హైదరాబాద్‌లో తొలిసారి గ్లోబల్ రియల్ ఎస్టేట్ సదస్సు

- హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో సెప్టెంబర్ 25 నుంచి 27 వరకు ఈవెంట్
- హాజరుకానున్న 35 దేశాలకు చెందిన 1500 మందికి పైగా ప్రతినిధులు
- ఏఐ, ప్రాప్‌టెక్, అంతర్జాతీయ పెట్టుబడులపై ప్రధానంగా చర్చ
- భారత రియల్ రంగం ప్రపంచ స్థాయికి చేరిందన్న నిర్వాహకులు

ప్రపంచ రియల్ ఎస్టేట్ రంగానికి సంబంధించిన ప్రతిష్ఠాత్మక ఏడవ అంతర్జాతీయ రియల్ ఎస్టేట్ కాన్ఫరెన్స్ (IREC)కు హైదరాబాద్ నగరం తరువాయి 2లో

## ఇజ్రాయెల్ సెటిల్‌మెంట్లపై యూకే కఠిన చర్యలు.. వాణిజ్యంపై నిషేధం



- వెస్ట్ బ్యాంక్‌లోని ఇజ్రాయెల్ సెటిల్‌మెంట్లపై యూకే వాణిజ్య నిషేధం
- పాలస్తీనియన్లపై జాతి నిర్మూలన జరుగుతోందన్న బ్రిటన్ విదేశాంగ మంత్రి
- యూకే నిర్ణయానికి ఫ్రాన్స్, కెనడా మద్దతు.. పలు యూరప్ దేశాలూ ఇదే బాటలో
- నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకించిన ఇజ్రాయెల్, అమెరికా 2లో

## వాయు కాలుష్యంపై కేంద్రం సర్వే.. లక్నో టాప్, హైదరాబాద్ 19, విశాఖ 21

- స్వచ్ఛ వాయు సర్వేక్షణ్ 2026 ర్యాంకుల్లో లక్నోకు అగ్రస్థానం
- 10 లక్షల జనాభా నగరాల కేటగిరీలో ఢిల్లీకి 21వ ర్యాంక్
- విశాఖతో కలిసి 21వ ర్యాంక్ పంచుకున్న దేశ రాజధాని నగరం
- గాలి నాణ్యతతో కాకుండా కాలుష్య నియంత్రణ చర్యల ఆధారంగా ఈ ర్యాంకులు
- హైదరాబాద్‌కు 19వ స్థానం, ముంబైకి 28వ ర్యాంక్
- తీవ్ర కాలుష్యం ఉన్నప్పటికీ బెంగళూరు, శ్రీనగర్ కంటే ఢిల్లీకి మెరుగైన స్థానం



దేశవ్యాప్తంగా తీవ్ర వాయు కాలుష్యంతో సతమతమవుతున్న ఢిల్లీ, కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ విడుదల చేసిన 'స్వచ్ఛ వాయు సర్వేక్షణ్ 2026' ర్యాంకుల్లో ఆసక్తికరమైన ఫలితాన్ని సాధించింది. 10 లక్షలకు పైగా జనాభా ఉన్న నగరాల కేటగిరీలో ఢిల్లీ 21వ స్థానంలో నిలిచింది. తీవ్ర శీతాకాలపు పొగమంచు, విషపూరిత గాలి ఉన్నప్పటికీ.. బెంగళూరు (32వ ర్యాంక్), శ్రీనగర్ ( తరువాయి 2లో

# ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌కుమార్‌రెడ్డిలపై సస్పెన్షన్ వేటు

హైదరాబాద్: శాసనసభ, మండలి సమావేశాల రెండోరోజు మంగళవారం కూడా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. స్పీకర్‌పై భారాస ఎమ్మెల్సీ తాతా మధు చేసిన వ్యాఖ్యలపై సభ లోపల, బయటా కూడా వివాదం కొనసాగింది. 'స్పీకర్‌ను దుర్భాషలాడటమే కాదు.. మహిళా పోలీసు అధికారుల పట్ల అనుచితంగా ప్రవర్తించారు. పోలీసులపై దాడులకు పాల్పడ్డారు' అని ఉప ముఖ్యమంత్రి భట్టి సహా మంత్రులు, ఎమ్మెల్యేలు మంగళవారం శాసనసభలో ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌కుమార్‌రెడ్డిల వైఖరిని తీవ్రంగా తప్పు పట్టారు. వారిద్దరిపై చర్య తీసుకోవాలని కోరుతూ శాసనసభ తీర్మానం చేసి.. మండలి ఛైర్మన్‌కు పంపింది. ఈ సెషన్ ముగిసే వరకు వారిద్దరినీ సస్పెండ్ చేస్తున్నట్లు మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ప్రకటించారు.

* **ఉదయం నుంచి నాటకీయ పరిణామాలు**

అసెంబ్లీ సమావేశాల తొలిరోజు సోమవారం స్పీకర్‌పై ఎమ్మెల్సీ తాతా మధు బయట వివాదాస్పద వ్యాఖ్యలు చేశారని.. పోలీసు అధికారులపై మరో ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి దౌర్జన్యంగా వ్యవహరించారని స్పీకర్ ఓఎస్డీ ఫిర్యాదు మేరకు వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీతో సహా పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసిన పోలీసులు.. మంగళవారం ఉదయాన్నే వారిద్దరిని వారి ఇళ్ల వద్దనే అరెస్టు చేశారు. ఉద్రిక్త పరిస్థితుల నడుమ న్యాయస్థానంలో హాజరుపర్చారు. మధ్యాహ్నం వరకూ కొనసాగిన వాదనల అనంతరం.. ఇద్దరు ఎమ్మెల్సీలను రిమాండు చేయడానికి న్యాయస్థానం తిరస్కరించడంతో.. పూచీకత్తుపై వారిద్దరూ విడుదలయ్యారు. ఈలోగా ఉదయం 10 గంటలకు శాసనసభ ప్రారంభం కాగానే.. భారాస ఎమ్మెల్యేలు నల్ల బ్యాడ్జీలు ధరించి సభలోకి అడుగుపెట్టారు. తమ మహిళా ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిలను అవమానించిన పోలీసులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని భారాస శాసనసభాపక్ష ఉపనేత టి.హరీశ్‌రావు ఆరోపించారు. ఇదే అంశంపై మాట్లాడుతున్న హరీశ్‌ను స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అడ్డుకున్నారు. మహిళా సభ్యులపై తమకు గౌరవం ఉందని, సోమవారం నాటి సంఘటనపై విచారణకు ఆదేశించామని, రిపోర్టు వచ్చాక బాధ్యులపై చర్యలు తీసుకుంటామని సభాపతి వివరించారు. హరీశ్‌రావు మళ్లీ ఆ మహిళా ఎమ్మెల్యేల అంశాన్నే ప్రస్తావించడంతో సభాపతి ఆగ్రహం వ్యక్తంచేశారు. "భారాస ఎమ్మెల్సీ అన్నది మీ తల్లిని కాదు.. నా తల్లిని.. నాకు ఆవేశం ఉండాలి. మీకెందుకు ఆవేశం" అని ప్రశ్నించారు.

## పోలీసు ఉద్యోగాలకు దరఖాస్తు గడువు పెంపు

హైదరాబాద్: తెలంగాణ పోలీసు నియామక మండలి చేపట్టిన ఉద్యోగాలకు దరఖాస్తు గడువును పెంచారు. ఈ నెల 9వ తేదీతో వ్యవధి ముగుస్తుండగా 16 వరకు పొడిగిస్తున్నట్లు నియామక మండలి ఛైర్మన్ వి.వి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో పోలీసు, స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్, అగ్నిమాపకవిపత్తు నిర్వహణ, జైళ్ల శాఖల్లో కలిపి మొత్తం 7,437 పోస్టుల భర్తీకి జులై 29న మండలి నాలుగు వేర్వేరు నోటిఫికేషన్లను విడుదల చేసిన విషయం తెలిసిందే. "ఆగస్టు 19 నుంచి ఇప్పటివరకు 3,38,336 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. వారిలో 25% మంది మహిళా అభ్యర్థులు ఉన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న వారిలో 2,88,530 మంది ఫీజు చెల్లించారు. అందులో 2,76,085 మంది దరఖాస్తులను సైతం సమర్పించారు... 95% మందికి సంబంధించి ఆధార్ పరిశీలన కూడా పూర్తయింది. అలానే ఈ నియామకాల్లో మొదటిసారి ఎస్సీ రిజర్వేషన్‌లో గ్రూప్ 1, గ్రూప్ 2, గ్రూప్ 3 వర్గీకరణ అమలు చేస్తున్నాం. ఇప్పటికే రిజిస్ట్రేషన్ చేసుకున్న వారు ఫీజులు చెల్లించి దరఖాస్తు ప్రక్రియ పూర్తి చేసుకోవాలి.

## నా వడోదరా అద్భుతం.. ప్రధాని మోదీ భావోద్వేగం

(మొదటిపేజీ తరువాయి)

ప్రజలందరూ ఏకమై నగరాన్ని శుభ్రం చేయడానికి చేపట్టిన 'స్వచ్ఛతతో స్వాగతం' కార్యక్రమాన్ని చూసి తన హృదయం గర్వంతో ఉప్పొంగిపోయిందని ఆయన అన్నారు. నేడు మహారాజా సయాజీరావ్ యూనివర్సిటీలో జరిగిన 'నమో 4 వికసిత్ భారత్' కార్యక్రమంలో ప్రధాని మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ.. "నిన్న నేను ఒక వీడియో చూశాను. నా వడోదరాను చూసి నా ఛాతీ గర్వంతో ఉప్పొంగిపోయింది. అద్భుతం!" అంటూ నగర ప్రజల భాగస్వామ్యాన్ని కొనియాడారు. తన పర్యటనకు ముందు నగరం మొత్తం ఒక ప్రజా ఉద్యమంలా మారి శుభ్రత కార్యక్రమాలు చేపట్టడంపై ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం వడోదరాలోని ప్రతి కుటుంబంలో స్వచ్ఛతపై సరికొత్త వాతావరణాన్ని సృష్టించిందని పేర్కొన్నారు. ఈ స్వచ్ఛతా స్ఫూర్తిని రాబోయే పండుగలైన గణేశ్ చతుర్థి, నవరాత్రి, దీపావళి వరకు కొనసాగించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. "ఈసారి గణపతి వచ్చినప్పుడు, ఆయన ఆశీస్సులన్నీ వడోదరాపైనే కురుస్తాయని నేను భావిస్తున్నాను" అని ఆయన వ్యాఖ్యానించారు. ఈ పరిశుభ్రతా కార్యక్రమాన్ని కేవలం తాత్కాలికంగా కాకుండా, శాశ్వత పౌర నిబద్ధతగా మార్చుకోవాలని సూచించారు. "ఇప్పుడు మనం ఒక సంకల్పం తీసుకుందాం. వడోదరాను మళ్లీ అపరిశుభ్రంగా మారకుండా చూసుకుందాం" అని గుజరాతీలో ప్రజలను కోరారు. ప్రధాని మోదీ తన పర్యటనలో భాగంగా రూ.35,000 కోట్లకు పైగా విలువైన అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఇందులో వెస్టర్న్ డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్ (డబ్ల్యూడీఎఫ్‌సీ), కొత్త రైల్వే సేవలు, జాతీయ రహదారుల ప్రాజెక్టులు, గృహ నిర్మాణం, నీటి సరఫరా వంటివి ఉన్నాయి. వడోదరా మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ స్వచ్ఛతా కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులు, పౌరులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యాసంస్థలు, ఎన్జీవోలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## వచ్చే ఏడాదే బుల్లెట్ రైలు పరుగులు..

భారత్ సొంతంగా అభివృద్ధి చేస్తున్న తొలి బుల్లెట్ రైలు త్వరలో పట్టాలెక్కనుంది. వచ్చే ఏడాది మే లేదా జూన్‌లో ఈ రైలు ట్రయల్ రన్స్ ప్రారంభమవుతాయని కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. పరీక్షలు పూర్తైన రెండు నుంచి నాలుగు నెలల్లో వాణిజ్య సేవలు ప్రారంభించే అవకాశం ఉందన్నారు. వడోదరలో నిర్వహించిన 'నమో ఫర్ వికసిత్ భారత్' కార్యక్రమంలో మంత్రి ఈ వివరాలు వెల్లడించారు. దేశీయంగా తయారవుతున్న హైస్పీడ్ రైలు తొలి బాడీ ఫ్రేమ్ ఇటీవలే పూర్తయిందని చెప్పారు. ప్రస్తుతం దానిపై స్క్వీజ్ టెస్టింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. "వచ్చే ఏడాది మే లేదా జూన్ నాటికి మన సొంత బుల్లెట్ రైలు ట్రయల్స్ కోసం పట్టాలపైకి వస్తుంది. రెండు నుంచి నాలుగు నెలల పరీక్షల తర్వాత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ రైలును ప్రారంభిస్తారు" అని వైష్ణవ్ చెప్పారు. ముంబైఅహ్మదాబాద్ బుల్లెట్ రైలు కారిడార్ పనులు వేగంగా సాగుతున్నాయని తెలిపారు. సూరత్‌వాపి మార్గం ఈ ఏడాది డిసెంబరు నాటికి పూర్తయ్యే అవకాశం ఉందన్నారు. ఈ రైలు అందుబాటులోకి వస్తే వడోదర నుంచి ముంబైకి ప్రయాణ సమయం కేవలం గంటన్నర మాత్రమే ఉంటుందని చెప్పారు.

### వాయు కాలుష్యంపై కేంద్రం సర్వే..

## లక్నో టాప్, హైదరాబాద్ 19, విశాఖ 21

(మొదటిపేజీ తరువాయి)

26వ ర్యాంక్) వంటి నగరాలను ఢిల్లీ వెనక్కి నెట్టడం గమనార్హం. అయితే, ఈ ర్యాంకులు నగరాల్లోని గాలి నాణ్యతకు ప్రతిబింబం కాదు. కాలుష్య నియంత్రణకు నగరాలు తీసుకుంటున్న చర్యల ఆధారంగానే ఈ సర్వేను నిర్వహించారు. ఈ కేటగిరీలో 198 పాయింట్లతో లక్నో అగ్రస్థానంలో నిలవగా, ఇండోర్ రెండో స్థానంలో, జబల్‌పూర్ (195 పాయింట్లు) మూడో స్థానంలో నిలిచాయి. ఢిల్లీ 172 పాయింట్లతో విశాఖపట్నంతో కలిసి 21వ స్థానాన్ని పంచుకుంది. గతేడాది 32వ స్థానంతో పోలిస్తే ఢిల్లీ తన ర్యాంకును మెరుగుపరుచుకోవడం విశేషం. ఇతర ప్రధాన నగరాలైన హైదరాబాద్ 19వ స్థానంలో, పాట్నా 16, ముంబై 28, చెన్నై 35, కోల్‌కతా 38వ స్థానాల్లో నిలిచాయి.

**ర్యాంకుల వెనుక అసలు కథ**

జాతీయ స్వచ్ఛమైన గాలి కార్యక్రమం (NCAP) కింద కేంద్రం ఈ సర్వేను నిర్వహిస్తోంది. కేవలం గాలి నాణ్యత స్థాయిలను కాకుండా, కాలుష్య నియంత్రణకు తీసుకుంటున్న చర్యలను ఈ సర్వే మదింపు చేస్తుంది. రోడ్ల పై దుమ్ము నిర్వహణ, ఘన వ్యర్థాల తొలగింపు, వాహన, పారిశ్రామిక ఉద్గారాల తగ్గింపు, నిర్మాణ వ్యర్థాల నిర్వహణ, ప్రజల్లో అవగాహన వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుంటారు. అందువల్ల, గాలి నాణ్యత తక్కువగా ఉన్న నగరం సైతం.. నియంత్రణ చర్యలను బలంగా అమలు చేస్తే మెరుగైన ర్యాంకు సాధించే అవకాశం ఉంటుంది. ఢిల్లీ విషయంలో ఇదే జరిగింది. మొత్తం 130 నగరాల్లో ఈ సర్వే నిర్వహించగా, 310 లక్షల జనాభా కేటగిరీలో రవుర్కెలా, 3 లక్షల లోపు జనాభా కేటగిరీలో కళింగ నగర్ ప్రథమ స్థానాల్లో నిలిచాయి.




## భావప్రకటన స్వేచ్ఛను హరిస్తే ఊరుకోం

- **టీయుడబ్ల్యూజే ప్రదర్శనలో ముక్తకంఠంతో హెచ్చరించిన జర్నలిస్టులు**

ప్రజాస్ఫూర్తి, హైదరాబాద్ : దేశంలో భావాప్రకటన స్వేచ్ఛను, ప్రజాస్వామ్యాన్ని, మీడియా స్వేచ్ఛను హరించేందుకు పాలకులు ప్రయత్నిస్తే ప్రజాస్వామికావాదుల నుండి ప్రతిఘటన తప్పదని జర్నలిస్టులు హెచ్చరించారు. ఢిల్లీలో విధినిర్వహణలో ఉన్న మహిళా జర్నలిస్టులపై పోలీసుల దాడి, అక్రమ కేసు, అరెస్టును నిరసిస్తూ మంగళవారం సాయంత్రం తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయుడబ్ల్యూజే) ఆధ్వర్యంలో జర్నలిస్టులు, ప్రజాస్వామికావాదులు కొవ్వుత్తులతో రాష్ట్ర రాజధాని హైదరాబాద్ లో నిరసన ప్రదర్శన నిర్వహించారు. బషీర్ బాగ్ లోని టీయుడబ్ల్యూజే కార్యాలయం నుండి ప్రాంభమైన ఈ నిరసన ప్రదర్శన, నిజాంకాలేజీ మీదుగా జగజీవన్ రాం విగ్రహం వరకు కొనసాగింది. అనంతరం టీయుడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు కె. విరాహత్ అలీ అధ్యక్షతన జరిగిన సభలో పలువురు సీనియర్ పాత్రికేయులు, ప్రజాస్వామికవాదులు ప్రసంగించారు. ప్రజాస్వామిక ఈ దేశంలో పౌరులకు రాజ్యాంగం కల్పించిన హక్కులను, స్వేచ్ఛను ఖునీ చేస్తూ, తమకు అనుకూలమైన విధానాలను ఎన్డియే ప్రభుత్వం అవలంబించడం అప్రజాస్వామికమని సీనియర్ పాత్రికేయులు, ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ మాజీ అధ్యక్షులు దేవులపల్లి అమర్ ఆందోళన వ్యక్తం చేసారు. ఐదు రోజుల క్రితం ఢిల్లీలో విధినిర్వహణ లో ఉన్న మైనారిటీ సామాజిక వర్గానికి చెందిన మహిళా జర్నలిస్టులు షాహిన్ ఖాన్, నఫీజా ఖాన్ లపై పోలీసులు దాడి చేయడం, వారిని అక్రమంగా అరెస్టు చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యంలో మీడియా స్వేచ్ఛను, జర్నలిస్టుల హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని ఈ సభలో పాల్గొన్న పలువురు సూచించారు. జర్నలిస్టులపై దాడులు, బెదిరింపులు, అక్రమ అరెస్టులకు పాల్పడటం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని వారు అన్నారు. మహిళా జర్నలిస్టులకు న్యాయం చేయడంతో పాటు, ఘటనకు బాధ్యులైన పోలీసులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ ప్రదర్శనలో ఐజేయు స్టీరింగ్ కమిటీ సభ్యులు ఎం.ఏ. మాజీద్, జాతీయ కార్యదర్శి వై. నరేందర్ రెడ్డి, జాతీయ కార్యవర్గ సభ్యులు కల్లూరి సత్యనారాయణ, కె. అజిత, హైదరాబాద్ ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షురాలు అత్తలూరి అరుణ, టీయుడబ్ల్యూజే మహిళా జర్నలిస్ట్స్ విభాగం కన్వీనర్ రాజేశ్వరీ, ప్రగతిశీల మహిళా సంఘం నాయకురాలు సంధ్య, సీనియర్ పాత్రికేయులు వనజ, స్వప్న, విమల, టీయుడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏ. రాజేష్, బి. కిరణ్ కుమార్, హెచ్.యు.జే అధ్యక్షుడు శిగా శంకర్ గౌడ్, తెలంగాణ చిన్న, మధ్యతరగతి పత్రికల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యూసుఫ్ బాబు, అశోక్, ఫోటో జర్నలిస్ట్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె.ఎన్.హరి, తెలంగాణ ఉర్దూ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి గౌస్ మోహియొద్దీన్ లతో పాటు పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

## హైదరాబాద్‌లో తొలిసారి గ్లోబల్ రియల్ ఎస్టేట్ సదస్సు

(మొదటిపేజీ తరువాయి)

ఆతిథ్యం ఇవ్వనుంది. దేశంలో ఈ అంతర్జాతీయ సదస్సు జరగడం ఇదే ప్రథమం. 2026 సెప్టెంబర్ 25 నుంచి 27 వరకు మూడు రోజుల పాటు హైటెక్స్‌లోని ఎగ్జిబిషన్ సెంటర్‌లో ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించనున్నారు. ఈ గ్లోబల్ ఈవెంట్‌కు 35కు పైగా దేశాల నుంచి 1500 మందికి పైగా ప్రతినిధులు, పరిశ్రమల అధినేతలు, నిపుణులు హాజరుకానున్నారు. "ది డోర్ టు వాట్ హ్యాపెన్స్ నెక్స్ట్" (భవిష్యత్తుకు తలుపులు) అనే థీమ్‌తో ఈ సదస్సును నిర్వహిస్తున్నారు. రియల్ ఎస్టేట్ రంగంలో రాబోయే మార్పులు, మారుతున్న ఆర్థిక ప్రాధాన్యతలు, అంతర్జాతీయ పెట్టుబడులు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI), ప్రాప్‌టెక్, డీప్‌టెక్, సుస్థిర అభివృద్ధి వంటి కీలక అంశాలపై ఈ వేదికగా విస్తృతంగా చర్చించనున్నారు. ఈ కార్యక్రమం మూడు ప్రధాన విభాగాల కలయికగా జరగనుంది. ఇందులో అంతర్జాతీయ రియల్ ఎస్టేట్ కాన్ఫరెన్స్‌తో పాటు, ప్రాప్‌టెక్ అండ్ రియల్ ఎస్టేట్ ఇన్నోవేషన్ షోకేస్, లగ్జరీ ప్రాపర్టీ ఎక్స్‌పో కూడా ఉంటాయి. ఈ సందర్భంగా నేషనల్ అసోసియేషన్ ఆఫ్ రియల్టర్స్ఇండియా (నార్ఇండియా) ఛైర్మన్ సుమంత్ రెడ్డి ఆరాణి మాట్లాడుతూ, "భారతదేశ డెవలపర్లు, నిపుణులు, ప్రాజెక్టులు అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా పనిచేసే స్థాయికి చేరుకున్నాయి" అని అన్నారు. ఈ సదస్సు ఆ స్థాయిని ప్రపంచానికి చాటి చెబుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. IREC 2026 ఛైర్ శైలేందర్ సింగ్ మాట్లాడుతూ, "ప్రపంచ రియల్ ఎస్టేట్ రంగంలో రానున్న మార్పులతో భారతదేశాన్ని అనుసంధానించే ఒక వేదికను సృష్టించాలన్నదే ఈ సదస్సు ముఖ్య ఉద్దేశం" అని వివరించారు.

### డైమండ్ సిటీ జోరు.. వినియోగంలో

## బెంగళూరును, ఆదాయంలో హైదరాబాద్‌ను దాటేసిన సూరత్

భారతదేశ ఆర్థిక చిత్రపటంలో సరికొత్త అధ్యాయం ఆవిష్కృతమైంది. దేశంలోని ఆరు ప్రధాన మెగాసిటీలైన ముంబై, బెంగళూరు, ఢిల్లీ, చెన్నై, హైదరాబాద్, కోల్‌కతాలను పక్కన పెడితే, అతిపెద్ద వినియోగ మార్కెట్‌గా గుజరాత్‌లోని సూరత్ నగరం అవతరించింది. కేవలం ఒక పారిశ్రామిక నగరంగానే కాకుండా, బలమైన కొనుగోలు శక్తి కలిగిన పట్టణంగా సూరత్ నిలవడం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. 'ది మెనీ అర్బన్ ఇండియాస్' పేరుతో ఇటీవల విడుదలైన ఒక నివేదిక ఈ ఆసక్తికర విషయాలను వెల్లడించింది. ఈ నివేదిక ప్రకారం.. సూరత్ నగర వార్షిక వినియోగ మార్కెట్ విలువ సుమారు 30 బిలియన్ డాలర్లు (దాదాపు రూ. 2.5 లక్షల కోట్లు). ఈ విషయంలో సూరత్, అహ్మదాబాద్ మరియు పుణె నగరాలతో పాటు టాప్ 6 మెట్రోల తర్వాత అత్యంత కీలకమైన మార్కెట్‌గా నిలిచింది. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, సగటు గృహ వినియోగంలో సూరత్.. టెక్ హబ్ బెంగళూరును అధిగమించింది. అంతేకాదు, సగటు కుటుంబ ఆదాయంలో హైదరాబాద్, చెన్నై, కోల్‌కతా వంటి మెట్రో నగరాల కన్నా ముందంజలో ఉండటం సూరత్ ఆర్థిక శక్తికి నిదర్శనం. దేశంలోని టాప్ 100 నగరాలు, జనాభాలో ఐదో వంతు కన్నా తక్కువగా ఉన్నప్పటికీ, దేశ మొత్తం వినియోగంలో మూడో వంతు వాటాను కలిగి ఉన్నాయి. ఈ నగరాల్లో గృహ వ్యయం ఏటా 10.4శాతం చొప్పున పెరుగుతోంది. అయితే, ఇందులోనూ ఆరు ప్రధాన మెట్రోల వాటా 46శాతంగా ఉంది. ఈ నేపథ్యంలో, వేగంగా అభివృద్ధి చెందుతూ, అధిక తలసరి వ్యయం కలిగిన 19 నగరాలను ఈ నివేదిక 'బూమ్‌టౌన్‌లు'గా వర్గీకరించింది.

## పాఠశాలలను ఫైర్ ఎన్వోసీ నుంచి మినహాయించాలి

* **ప్రస్తుతం ఉన్న పాఠశాలకు స్వీయ ధృవీకరణ తీసుకుంటే సరిపోతుంది**
* **ఫైర్ శాఖ డైరెక్టర్ కు విన్నవించిన ట్రస్మా బృందం**



ప్రజాస్ఫూర్తి, హైదరాబాద్ : ప్రస్తుతం నిర్వహిస్తున్న పాఠశాలలకు ఫైర్ ఎన్‌ఓసి ల నుంచి మినహాయింపు ఇవ్వాలని తెలంగాణ గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాల యాజమాన్య సంఘం (ట్రస్మా) రాష్ట్ర అధ్యక్షులు ఎస్ఎన్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు నానక్ రామ్ గూడ లోని తెలంగాణ ఫైర్ డిజాస్టర్ రెస్పాన్స్ ఎమర్జెన్సీ అండ్ సివిల్ డిఫెన్స్ డిపార్ట్మెంట్ (ఐ ఆర్ డి ఎ ) డైరెక్టర్ జనరల్ విక్రమ్ సింగ్ మాన్ కి ప్రతినిధి బృందం వినతి పత్రాన్ని అందజేశారు. ఫైర్ ఎన్ ఓ సి పొందడం లో ఎకనామికల్ పాఠశాలల నిర్వాహకులు పడుతున్న బాధలు, వాస్తవాలను ఆయన దృష్టికి తీసుకురావడం తీసుకెళ్లారు. నూతన నిబంధనలు రూపకల్పనాలో తమ అభిప్రాయాలను, సూచనలను పరిగణలోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికె నడుస్తున్న పాఠశాలలకు కూడా ఫైర్ ఎన్‌ఓసి ని అడగడం సరికాదని ఎస్ ఎన్ రెడ్డి తెలిపారు. పాఠశాల నిర్వాహకుల వద్ద నుంచి స్వీయ ధృవీకరణ తీసుకుంటే సరిపోతుందని తెలిపారు. దే స్కాలర్ స్కూల్స్ కమర్షియల్ క్యాటగిరిలో పరిగణించవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. సెట్బాక్ లో రిలాక్సేషన్ ఇవ్వాలని కోరారు. ఎన్ ఓ సి సర్టిఫికేషన్ ఫీజు నామినల్ చేయాలన్నారు. ప్రతి పాఠశాలలో ఫైర్ సేఫ్టీ అవేర్నెస్ ప్రోగ్రాం కండక్ట్ చేయాలని విజ్ఞప్తి చేశారు. పాఠశాలలను ఇతర వ్యాపార సముదాయాలు, హోటళ్లు, సినిమా థియేటర్లతో పోల్చి చూడవద్దని వాటికి పాఠశాలకు చాలా వ్యత్యాసం ఉందన్నారు. వీటన్నిటిని దృష్టిలో ఉంచుకొని పాఠశాలను ప్రత్యేక కేటగిరి కింద పరిగణించి నిబంధనలను సరళీకృతం చేయాలని కోరారు. ఇందుకు డైరెక్టర్ సానుకూలంగా స్పందించారని తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి కె అనిల్ కుమార్, కోశాధికారి కె శ్రీకాంత్ రెడ్డి లు హాజరయ్యారు.

# చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

*** పి ఆర్ టి యు టి ఎస్ జిల్లా అధ్యక్షులు బివి రమణారావు**



ప్రజాస్ఫూర్తి, భైంసా: ఉద్యోగ, ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పి ఆర్ టి యు టి ఎస్ సంఘ జిల్లా అధ్యక్షులు మరియు టీజీ ఈ జెఎసి అడిషనల్ సెక్రటరీ జనరల్ బివి రమణారావు, పిలుపునిచ్చారు. సోమవారం సాయంత్రం భైంసా మండల పరిషత్ సిబ్బంది మరియు ఉపాధ్యాయులతో కలిసి చలో హైదరాబాద్ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను టి జిఈ జెఎసి జిల్లా శాఖ ఆధ్వర్యంలో భాగస్వామ్య సంఘాల ప్రతినిధులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం సంఘం ఆధ్వర్యంలో నిరంతరం పోరాటాలు కొనసాగిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్లను సానుకూలంగా పరిశీలించి వెంటనే పరిష్కరించాలని కోరారు. పిఆర్సి , డిఎలు తదితర పెండింగ్ బకాయిలకు సంబంధించిన సమస్యలను వెంటనే పరిష్కరించడంతో పాటు ఉద్యోగ, ఉపాధ్యాయులకు భద్రత లేని సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా 2003 కంటే ముందు నోటిఫికేషన్ విడుదలై 2004 సెప్టెంబర్ తర్వాత నియామకమైన ఉద్యోగ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని అమలుపరుస్తూ వెంటనే ఉత్తర్వులు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. చలో హైదరాబాద్ కార్యక్రమానికి జిల్లా నుంచి ఉద్యోగ, ఉపాధ్యాయులు పెన్షనర్లు అధిక సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో మండల పరిషత్ పర్యవేక్షకులు సురేష్ చందర్ గౌడ్ పి ఆర్ టి యు టి ఎస్ భైంసా మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎస్ గంగాధర్, ఎన్ కృష్ణ పి ఆర్ టి యుటిఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సయ్యద్ అన్సర్, గంగామోన్, సలీం, మహమ్మద్ ఖాన్ ,ఏ.గోపాల్ జిల్లా ఉపాధ్యక్షులు జి పుండలిక్ మండల విద్యాశాఖ అధికారి ఏ సుభాష్ ప్రధానోపాధ్యాయులు కనకరాజు పంచాయతీ సెక్రటరీలు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

## జనగామ కేజీబీవీలో నాన్ టీచింగ్ పోస్టు భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

*** స్వీపర్ – స్కావెంజర్ పోస్టు ఒక్కటి..**
*** నెలకు రూ.9,750 గౌరవ వేతనం..**

జనగామ, ప్రజాస్ఫూర్తి : జిల్లాలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం (కేజీ బీవీ )లో ఖాళీగా ఉన్న స్వీపర్ - స్కావెంజర్ పోస్టు భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి, సమగ్ర శిక్ష జిల్లా ప్రాజెక్టు అధికారి తెలిపారు. జనగామ కేజీబీవీ లో ఒక పోస్టు ఖాళీగా ఉండగా, నెలకు రూ.9,750 గౌరవ వేతనం చెల్లించనున్నారు. అభ్యర్థి 7వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. సంబంధిత కేజీబీవీ ఉన్న గ్రామానికి చెందిన స్థానిక అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత,అనంతరం అదే మండలానికి చెందిన అర్హులకు అవకాశం కల్పించనున్నారు. సెప్టెంబర్ 9 నుంచి 11 వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. 11న సాయంత్రం 5 గంటలలోపు జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం, జనగామలో దరఖాస్తులు సమర్పించాలి. సెప్టెంబర్ 13న ఉదయం10. 30 గంటలకు పరీక్ష నిర్వహించనున్నట్లు అధికారులు వెల్లడించారు. విద్యార్హత, స్థానిక నివాస ధ్రువపత్రాల ప్రతులను దరఖాస్తుకు జతచేయాలని సూచించారు.

## ఎస్ఐఆర్2026 గడువు పొడిగింపు

*** అక్టోబర్ 7 వరకు క్లెయిమ్స్, అభ్యంతరాల స్వీకరణ.**

జనగామ, ప్రజాస్ఫూర్తి : ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్2026) లో భాగంగా క్లెయిమ్స్, అభ్యంతరాల దాఖలు గడువును అక్టోబర్ 7 వరకు పొడిగించినట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సందీప్‌కుమార్ ఝా తెలిపారు. గతంలో ఉన్న సెప్టెంబర్ 16 గడువును పొడిగిస్తూ ఎన్నికల సంఘం సవరించిన షెడ్యూల్ జారీ చేసిందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో పేరు నమోదు, మార్పులు, సవరణలు, చిరునామా మార్పు తదితర దరఖాస్తులను గడువులోగా సమర్పించాలని సూచించారు. నోటీసులు అందుకున్న అనామలీస్, నో మ్యాపింగ్ ఓటర్లు విచారణకు హాజరై వివరాలను సరిచేసుకోవాలన్నారు.

**సవరించిన షెడ్యూల్ :**

క్లెయిమ్స్, అభ్యంతరాలు అక్టోబర్ 7 వరకు విచారణలు, పరిష్కార ప్రక్రియ నవంబర్ 5 వరకు; తుది ఓటరు జాబితా నవంబర్ 9న ప్రచురించనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. అధికారులు సవరించిన షెడ్యూల్‌ను పక్కాగా అమలు చేసి, ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని ఆదేశించారు.

## దళిత స్పీకర్ పై ఎమ్మెల్సీ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నాం



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : అసెంబ్లీకి నల్ల చొక్కాలతో బీఆర్ఎస్ నిర్వహించిన నిరసనలో ఖమ్మం ఎమ్మెల్సీ తాత మధు దళిత స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ను ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు, బూతులతో మాట్లాడటాన్ని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) మహబూబాబాద్ జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుడ్డేల రామ్మూర్తి మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాజ్యాంగ పదవిలో ఉన్న వ్యక్తిని కులంగా దూషించడం సరికాదని, ఇది సభా మర్యాదకు విరుద్ధమని ఆయన పేర్కొన్నారు. అధికార, ప్రతిపక్షాలు సభా సమయాన్ని దుర్వినియోగం చేస్తున్నాయని, ప్రజా సమస్యలపై చర్చ జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. చేవెళ్ల డిక్లరేషన్ పై అసెంబ్లీలో చర్చ జరపాలని డిమాండ్ చేశారు.

## కాచనపల్లిలో ఘనంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : మహబూబాబాద్ జిల్లా, బయ్యారం మండలంలోని, కాచనపల్లి గ్రామపంచాయతీలో ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. గ్రామ కాంగ్రెస్ నాయకులు, సర్పంచ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో కేక్ కట్ చేసి కార్యకర్తలు, గ్రామస్తులకు పంచారు.అనంతరం ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకుడు పర్షిక రాజు మాట్లాడుతూ అందరి అభిమాన నాయకుడు కోరం కనకయ్య ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో నిండు నూరేళ్లు ఉండాలని, భగవంతుని ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని కోరుకున్నారు.ఈ కార్యక్రమంలో బానోతు రాంబాబు, ఎస్కే యూసఫ్, బానోత్ మంగ్య, నునావత్ కిషన్, ఏర్వ సమ్మయ్య, ఇరప కరుణాకర్, ఇరప మహేష్, ఇరప నాగేంద్రబాబు, వేప నాగరాజు, భానోత్ వెంకటేష్, బానోత్ బుజ్జమ్మ, నునావత్ శాంతి తదితర గ్రామ పెద్దలు,కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## భారతీయ జనతా పార్టీ ముస్తాబాద్ మండల అధ్యక్షుడు సొల్లా క్రాంతికుమార్




ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: కార్యకర్తలే పార్టీకి ప్రాణపదం, గ్రామ స్థాయిలో కమిటీలను బలోపేతం చేయాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు మల్లారపు సంతోష్ రెడ్డి పిలుపునిచ్చారు. గ్రామ స్థాయిలో కమిటీలను పటిష్టం చేస్తూ కేంద్ర పథకాలను ప్రజలకు చేరువ చేయాలన్నారు. భారతీయ జనతా పార్టీ ముస్తాబాద్ మండల శాఖ ఆధ్వర్యంలో మండల కార్యాలయంలో జరిగిన కార్యవర్గ సమావేశానికి ముస్తాబాద్ మండల అధ్యక్షుడు సొల్లా క్రాంతికుమార్ అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా ఉపాధ్యక్షులు మల్లారపు సంతోష్ రెడ్డి మాట్లాడుతూ, ప్రతి కార్యకర్త సైనికులా పని చేసి మోదీ సంక్షేమ ఫలాలను ఇంటింటికీ చేరవేయాలని సూచించారు. ఈ సందర్భంగా సమావేశంలో పలు కీలక తీర్మానాలు చేశారు. వికసిత్ భారత్ సంకల్ప ప్రచారంతో పాటు స్థానిక ప్రజా సమస్యలపై పోరాటాలు చేయాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు శీలం రాజు, జిల్లా కౌన్సిల్ మెంబర్ మెరుగు అంజాగౌడ్, మాజీ అసెంబ్లీ కన్వీనర్ కరెడ్ల మల్లారెడ్డి, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి ఎదునూరి గోపికృష్ణ, మండల ఉపాధ్యక్షులు చికోటి మహేష్, చిట్టినేని శ్రీనివాస్ రావు, మెంగని మహేందర్, వరి వెంకటేష్, చిగురు వెంకన్న, మీస స్వామి, దీటి సత్తయ్య, ఒరగంటి సత్యం, మర్గల వేణు, మీస కర్ణాకర్, మల్లేశం, యాదగిరి, నర్సింలు, తిరుపతి, వినయ్, బూత్ కమిటీ అధ్యక్షులు తదితరులున్నారు.

## తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను జయప్రదం చేయండి

*** సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పోకల వెంకటేశ్వర్లు**



గరిడేపల్లి, ప్రజాస్ఫూర్తి: భూమికోసం, భుక్తి కోసం,పేద ప్రజలను వెట్టి చాకిరి నుండి విముక్తి చేయటం కోసం, నైజాం నవాబులపై, నాటి దొరలపై,దేశముఖ్ ల పై భూస్వాములపై, ఖాసీం రజ్వీ,రజాకారు సేనలకు వ్యతిరేకంగా, పేద ప్రజల పక్షాన పోరాడి అమరులైన, అమరవీరుల జ్ఞాపకార్థం సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 11 నుంచి 16 వరకు జరిగే తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను మండలంలోని గ్రామ గ్రామాన జరిపి అమరుల ఆశయ సాధనకు పునరంకితం కావాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పోకల వెంకటేశ్వర్లు పార్టీ కార్యకర్తలను కోరారు. తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల ప్రచారం లో భాగంగా మంగళవారం మండలంలోని పొనుగోడు గ్రామంలో తెలంగాణ సాయుధ పోరాట యోధులు పొనుగోడు గ్రామ మాజీ సర్పంచ్, తన ఆస్తిలో తన పిల్లల తో సమానంగా మూడోవంతు ఆస్తిని సిపిఐ పార్టీకి విరాళం ఇచ్చిన ధాత త్యాగశీలి కామ్రేడ్ అనుమాల లింగయ్య స్మారకస్తూపాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి అప్పయ్య రైతు సంఘం రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు జిల్లా కనకయ్య సిపిఐ పొనుగోడు గ్రామ కార్యదర్శి వేశాల ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు

## బిఆర్ఎస్ కార్యాలయంపై దాడి చేసిన వారిని తక్షణమే అరెస్ట్ చేయాలి

*** బోడుప్పల్ బి.ఆర్.ఎస్ పార్టీ అధ్యక్షుడు మంద సంజీవరెడ్డి**



మేడిపల్లి, ప్రజాస్ఫూర్తి :తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర రావు దిష్టిబొమ్మను, దగ్ధం చేసిన కాంగ్రెస్ నాయకులపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని మాజీ జెడ్పిటిసి, బోడుప్పల్ బి.ఆర్.ఎస్ పార్టీ అధ్యక్షుడు మంద సంజీవరెడ్డి మేడిపల్లి పోలీసులకు డిమాండ్ చేశారు. హౌస్ అరెస్ట్ లో ఉన్న మంద సంజీవరెడ్డి మీడియాతో మాట్లాడుతూ బి ఆర్ ఎస్ నాయకులు రాష్ట్రవ్యాప్తంగా శాంతియుతంగా నిరసనలు తెలుపుతుంటే అక్రమంగా హౌస్ అరెస్టు చేసి నిర్బంధించిన పోలీసులు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ దిష్టిబొమ్మలు కాల్చి, బి.ఆర్.ఎస్ కార్యాలయం పై కాంగ్రెస్ నేతలు రౌడీల మాదిరిగా దాడులు చేస్తే మాత్రం పోలీసులు వాళ్లకు సెక్యూరిటీ ఇస్తున్నారు కానీ వారిపై ఎలాంటి అరెస్టులు, చర్యలు తీసుకోవడంలేదని మండిపడ్డారు. కెసిఆర్ దిష్టిబొమ్మ దహనం, బి ఆర్ ఎస్ పార్టీ పై దాడి గురించి ఆధారాలను, సమాచారాన్ని మేడిపల్లి సీఐ కి అందించానని, తక్షణమే ఆ ఘటనలో పాల్గొన్న కాంగ్రెస్ నేతలపై కఠిన చర్యలు తీసుకోవాలని మేడిపల్లి పోలీస్ అధికారులు డిమాండ్ చేస్తున్నట్లు మంద సంజీవరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రధాన కార్యదర్శి మీసాల కృష్ణ, మేయర్ సామల బుచ్చిరెడ్డి, సీనియర్ నాయకులు రామచంద్రారెడ్డి, కొత్త చక్రపాణి గౌడ్, బందారం శ్రీధర్ గౌడ్, కృష్ణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆశ వర్కర్ల అరెస్టులు సరికాదు



ప్రజాస్ఫూర్తి , జన్నారం : ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారం కొరకు సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా, చలో హైదరాబాద్ ఇందిరా పార్క్ ధర్నా కార్యక్రమానికి ఆశ వర్కర్లు వెళ్లకుండా ముందస్తుగా అరెస్టులు చేయడం న్యాయం కాదని, సిఐటియు సీనియర్ నాయకులు కూకటీకారు బుచ్చయ్య ఖండించారు.ఆశ వర్కర్లు గత 20 సంవత్సరాల నుండి పేద ప్రజలకు సేవలు అందిస్తున్నారు. వీరంతా మహిళలు, బడుగు బలహీన వర్గాలకు చెందిన వారే అత్యధికులు. నేటికీ వీరికి ఎలాంటి చట్టబద్ధ సౌకర్యాలు లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు.కనీసం గ్యారంటీ ఫిక్స్డ్ వేతనం కూడా ప్రభుత్వం నిర్ణయించలేదని,ఆశ వర్కర్ల సమస్యల పరిష్కారం కోసం ధర్నా కార్యక్రమానికి వెళ్తుంటే పోలీస్ వారు అరెస్టు చేసి అడ్డుకోవడం సరికాదన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం కూడా అనేక హామీలు ఇచ్చింది.అవి నెరవేర్చలేదు. అలాగే కాంగ్రెస్ ప్రభుత్వము కూడా హామీలు ఇచ్చి ఇంత కాలం గడిచిన ఏ ఒక్క సమస్య పరిష్కరించలేదని అన్నారు. నీరజ మాట్లాడుతూ 50 లక్షల ఇన్సూరెన్స్, 50,000 మట్టి ఖర్చులు,రిటైర్మెంట్ బెనిఫిట్స్, తదితర హామీలు ఇచ్చి, ఇంతవరకు అమలు చేయలేదని, పిఆర్సి ఏరియాస్, లెప్రసీ, పల్స్ పోలియో, ఎలక్షన్ డ్యూటీ డబ్బులు సంవత్సరాలు తరబడి పెండింగ్లో ఉన్నాయని అన్నారు. ఆశా వర్కర్లకు 18 వేల రూపాయల ఫిక్స్డ్ వేతనం నిర్ణయించాలని డిమాండ్ చేశారు. అరెస్టు అయినా ఆశ వర్కర్లు జి.శైలజ, ఎం లక్ష్మి టి రాజేశ్వరి, డి వజ్రమాల, కళావతి ఆర్ గంగామణి, సుజాత, పి రమ, కే సునీత, ఎం శైలజ, ఎం భూమక్క, డి సూర్య తదితరులు అరెస్టు అయ్యారు.

## బుల్లెట్ ట్రైన్ సాధన కోసం ఒకరోజు నిరహార దీక్ష



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట:సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్ మరియు రైల్వే సాధన కోసం జరుగుతున్న రిలే నిరాహార దీక్షలకు మద్దతుగా సూర్యాపేట పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు బెలిదె శ్రీనివాసులు ఆధ్వర్యంలో స్థానిక రైతు బజార్ వద్ద ఏర్పాటుచేసిన దీక్షా శిబిరంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సాయంత్రం 5 గంటలకు జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు వెంపటి వెంకటేశ్వర రావు ముఖ్య అతిథిగా పాల్గొని బెలిదె శ్రీనివాసులుకు నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామికవేత్త , సుధాకర్ పివిసి కంపెనీ ఎండి మీలా మహదేవ్ మద్దతు పలికి దీక్ష లో పాల్గొన్న వారికి పూలదండ లు వేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు పెద్దిరెడ్డి రాజా, గందూరి ప్రకాష్, జుట్టుకొండ సత్యనారాయణ,కర్నాటి కిషన్, ధర్మార్జున్ , పూర రామ్మూర్తి యాదవ్, రాపర్తి శ్రీనివాస్, మొరిశెట్టి కోటేశ్వరరావు, బూపతి రాములు, మిర్యాల వెంకటేశ్వర్లు, చల్లమల్ల నరసింహులు సంఘిభావం ప్రకటించారు. దీక్ష లో ఆర్యవైశ్య సంఘం నాయకులు ఉప్పల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి బిక్కుమల్ల కృష్ణ, కోశాధికారి వుప్పల శ్రవణ్ కుమార్, బ్రహ్మాండ్లపల్లి మురళి ధర్, చల్లా లక్ష్మయ్య, తోట శ్యామ్ ప్రసాద్, మంచాల రంగయ్య, కర్నాటి రవి, చల్లా లక్ష్మికాంత్, రాచకొండ శ్రీనివాస్, దయాకర్ గుప్త, మిట్టపల్లి రమేష్, తాళ్లపెల్లి రామయ్య, సోమ వెంకటేశ్వర్లు, సుమన్ వెంకన్న, గుడిపాటి రమేష్, సోమ ప్రవీణ్, బెలిదె అంజయ్య, బెజగం ఫణి, మహిళా సంఘం అధ్యక్షురాలు మిట్టపల్లి శ్రీదేవి, వర్కింగ్ ప్రెసిడెంట్ బెలిదె రాధ, తల్లాడ మోహన్, బొల్లం సురేష్, భోనగిరి కృష్ణ, తల్లాడ సోమయ్య, నాగరాజు, సోమ సోమేశ్వర్, నవిలిపురి నరేందర్, మహంకాళి సోమయ్య లు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ పదవి నుంచి తాత మధు ను తొలగించాలి

*** ఎన్ఎస్ యుఐ డిమాండ్**



ప్రజాస్ఫూర్తి ,కొత్తగూడెం : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎన్ఎస్ యుఐ జిల్లా అధ్యక్షులు అజ్మీర సురేష్ ఆధ్వర్యంలో రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పై బీ.ఆర్.ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ పోస్ట్ ఆఫీస్ సెంటర్‌లో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా అజ్మీర సురేష్ మాట్లాడుతూ రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న అసెంబ్లీ స్పీకర్ గౌరవాన్ని కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేయడం తీవ్రంగా ఖండించాల్సిన విషయమని , ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజ్యాంగబద్ధ పదవులకు గౌరవం ఇవ్వాల్సిన బాధ్యత ప్రజా ప్రతినిధులపై ఉందని ,వారిని అవమానించే విధంగా వ్యాఖ్యలు చేసిన తాతా మధుపై తగిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, ఆయనను ఎమ్మెల్సీ పదవి నుంచి తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు .ఈ కార్యక్రమంలో నాయకులు వసీం పాషా, కాటి సందీప్, లావుడియా గౌతమ్, ఉబ్బపల్లి నిఖిల్, షేక్ సమీర్, షేక్ అప్రోచ్ , సాయి, లక్కీ, జమీల్, షాహిద్, గౌతమ్, తదితరులు పాల్గొన్నారు.

## 420 హామీలు అమలు చేసేలా చూడాలంటూ అంబేద్కర్ విగ్రహానికి బీఆర్ఎస్ శ్రేణుల వినతి




ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: తెలంగాణాలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా హామీల అమలును ప్రశ్నించే ప్రతిపక్ష గొంతులను పోలీసు బలంతో నొక్కేయిస్తూ ప్రజాస్వామ్యాన్ని ఖూని చేస్తూ రాజ్యాంగ హక్కులను కాల రాస్తుందని మాజీ రాజ్యసభ సభ్యులు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు బడుగుల లింగయ్యయాదవ్, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వై.వెంకటేశ్వర్లు, మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్, మాజీ మున్సిపల్ చైర్పర్సన్ పెరుమాళ్ళ అన్నపూర్ణలు అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనపై బీఆర్ఎస్ చేపట్టిన నిరసన కార్యక్రమాల్లో భాగంగా చివరి రోజు మంగళవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఖమ్మం క్రాస్ రోడ్ లోని అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయమంటే సమాధానం చెప్పాల్సిన ప్రభుత్వం ఎదురుదాడికి దిగుతుందన్నారు. రాష్ట్రంలో రైతులు, విద్యార్థులు, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రతిపక్షం ప్రశ్నిస్తే పోలీసులతో అణిచివేయడం కాంగ్రెస్ ప్రబుత్వ నిరంకుశత్వానికి నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అంగిరేకుల నాగార్జున, మాజీ జడ్పీటీసీ జీడి భిక్షం, మాజీ ఎంపీపీ నెమ్మాది బిక్షం, జిల్లా నాయకులు ఉప్పల ఆనంద్, బండారు రాజా, పట్టణ పార్టీ అధ్యక్ష, కార్యదర్యులు సవరాల సత్యనారాయణ, బూర బాల సైదులు, మండలాల అధ్యక్షులు తూడి నర్సింహ్మారావు, వంగాల శ్రీ , దొంగరి యుగంధర్, జూలకంటి జీవన్ రెడ్డి, నాయకులు ఆకుల లవకుశ, ముదిరెడ్డి సంతోష్ రెడ్డి, ముదిరెడ్డి అనిల్ రెడ్డి లతో పాటు ప్రజా ప్రతినిదులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

## పలుకుబడుల భాషను కోరిన ప్రజల మనిషి కాళోజీ

**డా. గంగాప్రసాద్**

ప్రజాస్ఫూర్తి, మెదక్ జిల్లా: తెలుగు సాహిత్య రంగంలో కాళోజీ నారాయణరావు ముద్ర అజరామరమని, జయంతిని పురస్కరించుకొని మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమని ముఖ్య వక్త డా. గంగాప్రసాద్ పేర్కొన్నారు. కాళోజీ జయంతి (తెలంగాణ భాషా దినోత్సవం) సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో వారు “ప్రసార మాధ్యమాలు ప్రచార సాధనాలు” అనే అంశంపై విస్తృతోపన్యాసము చేశారు. నేటి డిజిటల్ యుగంలో వార్తలను, సమాచారాన్ని ప్రజల్లోకి వేగంగా తీసుకెళ్లడంలో ప్రసార మాధ్యమాలు, వివిధ ప్రచార సాధనాలు అత్యంత కీలక పాత్ర పోషిస్తున్నాయని వివరించారు. కాళోజీ నాటి సామాజిక చైతన్య భావాలను నేటి తరానికి చేరవేయడంలో మీడియా మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు.

# ఎమ్మెల్సీ తాతా మధు ని వెంటనే సస్పెండ్ చేయాలి

* **మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాస్తారోకో**

ప్రజాస్ఫూర్తి, జన్నారం : దళిత స్పీకర్ పై అసభ్యకర, అనుచిత వ్యాఖ్యలు చేసిన బి.ఆర్.ఎస్ పార్టీ ఎమ్మెల్సీ తాతా మధును వెంటనే సస్పెండ్ చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నందు నాయక్ డిమాండ్ చేశారు. నిర్మల్ డిసిసి అధ్యక్షుడు, ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఆదేశాల మేరకు మంగళవారం రోజున మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జన్నారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద



ధర్నా రాస్తారోకో నిర్వహించారు. ఎమ్మెల్సీ తాత మధు దిష్టిబొమ్మను తగలబెట్టడానికి ప్రయత్నించిన కాంగ్రెస్ నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ అధ్యక్షుడు నందు నాయక్ మాట్లాడుతూ దళిత స్పీకర్ గడ్డం ప్రసాద్ పై అసభ్యకరమైన వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ తాత మధు వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని అంతే కాకుండా బిఆర్ఎస్ పార్టీ నుండి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు మంద రాజేష్, ప్రధాన కార్యదర్శి మేకల మాణిక్యం, ఏ ఎం సి చైర్మన్ దుర్గం లక్ష్మీ నారాయణ, పొనకల్ సర్పంచ్ జక్కు సుష్మ భూమేష్, మార్కెట్ కమిటీ వైఎస్ చైర్మన్ ఫసిఉల్లా, పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు మోహన్ రెడ్డి,

# 45 వ వార్డు లో మంచినీటి సమస్య ను పరిష్కరించాలి

* **వార్డు కౌన్సిలర్ గండూరి పావని కృపాకర్**



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: సూర్యాపేట పట్టణంలో 45 వార్డులో మంచినీటి సమస్య చాలా ఎక్కువగా ఉందని, ఇక్కడ నల్లా నీళ్లు చాలా తక్కువగా వస్తున్నాయని 45 వ వార్డు కౌన్సిలర్ గండూరి పావని కృపాకర్ అన్నారు. మంగళవారం నాడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం లో మంచినీటి సమస్యపై ఆమె మాట్లాడారు. తరువాత మీడియాతో మాట్లాడుతూ 45 వ వార్డులో ప్రతిరోజు నీటి సమస్యలు ఎదురవు తున్నందున ప్రతిరోజు మూడు వాటర్ ట్యాంకర్లు పంపవలసిందిగా మున్సిపల్ చైర్మన్ కు విజ్ఞప్తి చేశారు. ఒక ట్యాంకర్ వస్తే అవి ఎవరికి సరిపోవడం లేదని, వార్డులో నల్లా నీరు రాక, బోర్లు ఎండిపోయి ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని కాబట్టి మున్సిపల్ చైర్మన్ చొరవ తీసుకొని ప్రతిరోజు మూడు టాంకర్లు వచ్చే విధంగా ఏర్పాటు చేయాలని అన్నారు. సూర్యాపేట పట్టణంలో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ లతో పాటు బిఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ లు వున్న వార్డులు కూడా అభివృద్ధి చేయాలని, అలాగే మొదటి సమావేశంలో ప్రతి వార్డుకు ఐదు లక్షల రూపాయల వ్యయంతో అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారని, ఇంతవరకు ఎక్కడ కూడా పనులు ప్రారంభం కాలేదని ఆమె అన్నారు.

# కేంద్ర కార్మిక సంఘాల సలహా బోర్డు నుండి సంఘాలను తొలగించడం సరైన పద్ధతి కాదు

* **సిఐటియు**



గరిడేపల్లి, ప్రజాస్ఫూర్తి : గరిడేపల్లి మండల కేంద్రంలో సిఐటియు ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ నిర్మాత బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి ఎదురుగా నిరసన వ్యక్తం చేయడం జరిగినది సిఐటియు జిల్లా నాయకులు షేక్ యాకోబు మాట్లాడుతూ కేంద్ర కార్మిక సంఘాల సలహా బోర్డు నుంచి ముఖ్యమైన సంఘాలు సిఐటియు ఏఐటియుసి ఐఎన్టియు సంఘాలను లేకుండా స్వతహాగా సలహా మండలి నడుపుకోవటం కార్మికులను మరింత దెబ్బతీసే విధంగా ఉందని అన్నారు మోడీ ప్రభుత్వం నామమాత్రంగా ఒకటి రెండు ప్రభుత్వ సంస్థలు చాలు కొమ్ముకాస్తుందని యాకూబ్ అన్నారు వెంటనే యధావిధిగా కేంద్ర కార్మిక సంఘాల సలహా బోర్డులో సిఐటియు ఏఐటియుసి ఐ ఎన్ టి సి .ఐ టి యు సంఘాలను ఉంచే విధంగా చర్యలు తీసుకోవాలని లేని ఎడల దేశవ్యాప్తంగా ఉద్యమాలు చేస్తామని షేక్ యాకూబ్ అన్నారు ఈ కార్యక్రమంలో సిఐటియు జిపి యూనియన్ అధ్యక్షులు కొండ సైదులు గౌరవ అధ్యక్షులు గోపగాని సత్య నారాయణ ఉపాధ్యక్షులు రావుల వెంకన్న బొంత వెంకటరెడ్డి మండాది ఉమా మచ్చ సైదమ్మ మేకపోతుల సైదులు లక్ష్మమ్మ పాండు భాస్కర్ నెహూరు వెంకటేశ్వర్లు సరిత కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# సూర్యాపేట జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కు సన్మానం



గరిడేపల్లి, ప్రజాస్ఫూర్తి: సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం రేగులగడ్డ తండ గ్రామపంచాయతీ పరిధిలోని ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న పరెడ్డి వీరారెడ్డి కి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు రావడం ఎంతో అభినందనీయం. ఈ సందర్భంగా సర్పంచ్ సరోజా నాగేశ్వర్ మాట్లాడుతూ మూతపడిన పాఠశాల తెర్పించడంలో తన వంతు సహాయ సహకారాలు అందించడం ఆర్థికంగా సహాయం అందించడం, తల్లిదండ్రులను మోటివేట్ చేయడంలో కీలకపాత్ర వహించినందుకు జిల్లాస్థాయిలో మన గ్రామ పాఠశాల ఉపాధ్యాయులు వీరా రెడ్డి నీ గుర్తించడం ఎంతో విశేషమని కొనియాడారు. గ్రామ ఉప సర్పంచ్ పీకా నాయక్ మాట్లాడుతూ పాఠశాల పునః ప్రారంభించబడినప్పుడు 50 కేజీల బియ్యం మరియు నోటు పుస్తకాలు అందించి పాఠశాల నిలబడడంలో తనదైన పాత్ర పోషించినందుకు అభినందించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు భంగ్య నాయక్, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శివ నాయక్, గ్రామ కార్యదర్శి బండ్ల సాయిబాబా, ఉపాధి హామీ సహాయకులు కొమరాజు నరసయ్య, మరియు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ ధరావత్ మంగమ్మ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజశేఖర్ సమక్షంలో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు.

# కాంగ్రెస్ పాలనకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ నిరసన

* **అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసిన బీఆర్ఎస్ నాయకులు.**



జనగామ, ప్రజాస్ఫూర్తి : కాంగ్రెస్ ప్రభుత్వ పాలనకు నిరసనగా జిల్లా కేంద్రం చౌరస్తాలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి బీఆర్ఎస్ నాయకులు వినతిపత్రం అందజేశారు. నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆదేశాల మేరకు కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడం లేదని విమర్శించారు. మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను అక్రమంగా అరెస్టు చేస్తున్నారని ఆరోపించారు. మాజీ మంత్రి సబితా ఇంద్రా రెడ్డి పట్ల వ్యవహరించిన తీరు క్షమించ రానిదని అన్నారు. "కాంగ్రెస్ హటావో.. రాష్ట్ర బచావో" నినాదంతో ప్రజా సమస్యలపై పోరాటం కొనసాగిస్తామని బీ ఆర్ఎస్ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అనుమతుల్లేకుండా విచ్చలవిడిగా షెడ్ల నిర్మాణాలు

* **గాయిత్రి హిల్స్ షెడ్ ను పరిశీలించిన బోడుప్పల్ సెటిలర్స్ ఫోరం ప్రతినిధులు**
* **అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోకపోతే ఆందోళన ఉద్ధృతం చేస్తామని హెచ్చరిక**




బోడుప్పల్, ప్రజాస్ఫూర్తి : బోడుప్పల్ సర్కిల్ పరిధిలో అనుమతులు లేకుండా నిర్మిస్తున్న షెడ్లు, ఇతర నిర్మాణాలపై బోడుప్పల్ సెటిలర్స్ ఫోరం ఆగ్రహం వ్యక్తం చేసింది. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు విచ్చలవిడిగా సాగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ ఫోరం చైర్మన్ ఎడ్ల శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. అనంతరం గాయిత్రిహిల్స్ లోని అనుమతి లేని షెడ్ ను ఫోరం ప్రతినిధులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఫోరం ప్రతినిధులు మాట్లాడుతూ.. బోడుప్పల్‌లో నిర్మాణాలకు అనుమతులు తీసుకోవాల్సిన నిబంధనలు ఉన్నప్పటికీ కొందరు వాటిని పట్టించుకోకుండా షెడ్లు, ఇతర నిర్మాణాలు చేపడుతున్నారని ఆరోపించారు. నిర్మాణ దశలోనే గుర్తించి చర్యలు తీసుకోవాల్సిన టౌన్‌ప్లానింగ్ అధికారులు ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారని మండిపడ్డారు. అక్రమ నిర్మాణాలపై స్థానికులు పలుమార్లు ఫిర్యాదులు చేసినా చర్యలు తీసుకోకపోవడం అధికారుల పనితీరుపై అనేక అనుమానాలకు తావిస్తోందన్నారు.

* **ప్రభుత్వ ఆదాయానికి గండి**

అనుమతులు లేకుండా నిర్మాణాలు సాగితే ప్రభుత్వానికి రావాల్సిన వివిధ రకాల రుసుములు, పన్నుల ఆదాయానికి గండిపడే అవకాశం ఉందని ఫోరం ప్రతినిధులు పేర్కొన్నారు. నిబంధనల ప్రకారం అనుమతులు పొందిన వారిపై కఠినంగా వ్యవహరిస్తూ, అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడుతున్న వారిని పట్టించుకోకపోవడం సరికాదన్నారు. అక్రమ నిర్మాణాలకు ఎవరు సహకరిస్తున్నారనే విషయంపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలని కోరారు. బోడుప్పల్ పరిధిలో అనుమతిలేని షెడ్లు, నిర్మాణాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి వివరాలను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన నిర్మాణాలపై చట్టప్రకారం చర్యలు తీసుకోవడంతో పాటు అవసరమైతే వాటిని తొలగించాలని కోరారు. అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు వచ్చినప్పుడు తక్షణమే స్పందించేలా టౌన్‌ప్లానింగ్ విభాగం ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు.

* **చర్యలు లేకుంటే ఆందోళన ఉద్ధృతం**

అనుమతిలేని షెడ్లపై అధికారులు వెంటనే చర్యలు తీసుకోకపోతే ఆందోళనను మరింత ఉద్ధృతం చేస్తామని సెటిలర్స్ ఫోరం ప్రతినిధులు హెచ్చరించారు. అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాల్సిన అధికారులే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ప్రజల్లో ప్రభుత్వ యంత్రాంగంపై నమ్మకం సన్నగిల్లుతుందని అన్నారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి బోడుప్పల్ లోని అనుమతి లేని నిర్మాణాలపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సెటిలర్స్ ఫోరం అధ్యక్షుడు కత్తి వెంకట్ రెడ్డి,ప్రధాన కార్యదర్శి అమరలింగారెడ్డి,కోశాధికారి బజ్జూరి శ్రీనివాస్ గుప్తా,సలహదారులు వెమకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

# సెప్టెంబర్ 10న "చలో హైదరాబాద్"ను విజయవంతం చేయాలి

* **జిల్లా జేఏసీ చైర్మన్ బి. రవి ప్రకాష్**



ప్రజాస్ఫూర్తి , మేడ్చల్ : తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం టీజీఈజేఏసీ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 10న నిర్వహించనున్న "చలో హైదరాబాద్" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా గెజిటెడ్, నాన్ గెజిటెడ్, క్లాస్-IV ఉద్యోగుల జేఏసీ చైర్మన్ బి. రవి ప్రకాష్ పిలుపునిచ్చారు.ఆయన అధ్యక్షతన మంగళవారం మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా వ్యాప్తంగా మేడ్చల్ ఎస్టీఓ, షమీర్పేట్ ఐటిఐ, మేడ్చల్-మల్కాజిగిరి కలెక్టరేట్, ప్రాథమిక ఆరోగ్యకేంద్రం అల్వాల్ తదితర కార్యాలయాల్లో "చలో హైదరాబాద్" పోస్టర్ల పంపిణీ, ఉద్యోగుల సమీకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా "చలో హైదరాబాద్" నినాదాలతో కలెక్టరేట్ ప్రాంగణం మార్మోగింది.ప్రభుత్వ మొండి వైఖరి, చిత్తశుద్ధి లేని పాలనపై ఉద్యోగుల గళం వినిపించాల్సిన అవసరం ఉందని బి. రవి ప్రకాష్ అన్నారు. మన సమస్యలను మనమే ముందుకు వచ్చి పరిష్కరించుకోవాలని, ఉద్యోగుల హక్కుల సాధన కోసం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 10న జిల్లావ్యాప్తంగా ఉద్యోగులంతా ఏకతాటిపైకి వచ్చి ఎల్బీ స్టేడియంలో తమ ఐక్యతను, పోరాట పటిమను చాటాలని కోరారు.ఈ కార్యక్రమంలో టీజీఈజేఏసీ ప్రధాన కార్యదర్శి వినోద్, అదనపు ప్రధాన కార్యదర్శి వై. రామేశ్వర్ గౌడ్, కో-చైర్మన్ బి. వెంకటేశ్వర్లు, టీఎన్జీఓఎస్ జిల్లా కార్యదర్శి భరత్ కుమార్, టీజీఓఎస్ జిల్లా కార్యదర్శి కురుమూర్తి, కోశాధికారి శేష సాయి గిరికాంత్, రంజిత , ఉపాధ్యక్షులు జేమ్స్, రాజని, కొండల్ రావు, వేణుగోపాల్, పెన్షన్ సంఘం అధ్యక్షుడు నరసింహులు, హాస్టల్ వెల్ఫేర్ ఫోరం అధ్యక్షుడు మాణిక్యం,యానిమల్ హస్బెండ్రీ ఫోరం ప్రతినిధులు రవి ప్రకాష్‌గౌడ్, విలాసిని, యూనిట్ అధ్యక్షులు, కార్యదర్శులు, ఇతర నాయకులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ పార్టీ తమ గత పాలనను గుర్తు తెచ్చుకోవాలి

* **ప్రజాస్వామ్యం ఎవరి సొత్తు కాదు పాలక పక్షానికైనా ప్రతిపక్షానికైనా**



గరిడేపల్లి, ప్రజాస్ఫూర్తి : గరిడేపల్లి మండల కేంద్రంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ సూర్యాపేట జిల్లా కార్యదర్శి బచ్చలకూరి కృష్ణ ప్రసాద్ పత్రిక సమావేశంలో మాట్లాడుతూ. అసెంబ్లీ గేటు వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అడ్డుకోవడంపై ఆ పార్టీ నేతలు ప్రజాస్వామ్యంపై దాడిఅంటూ ప్రశ్నిస్తున్నారు. ప్రజాప్రతినిధులను అడ్డుకోవడం సరైనదా కాదా అన్నది చర్చించాల్సిందే. కానీ బీఆర్ఎస్ నేతలు ఒక్కసారి తమ పాలన చరిత్రను కూడా గుర్తు చేసుకోవాలి.2015 మార్చి 9న ఈ. దయాకర్‌రావు, రేవంత్‌రెడ్డి సహా 10 మంది టీడీపీ ఎమ్మెల్యేలను బడ్జెట్ సమావేశాల మొత్తం కాలానికి సస్పెండ్ చేసి, సభ నుంచి మార్షల్స్ ద్వారా బయటకు పంపించారు.2015 మార్చి 26న అప్పటికే సస్పెండ్ అయిన అదే టీడీపీ ఎమ్మెల్యేలను అసెంబ్లీ భవనంలోకి భద్రతా సిబ్బంది అనుమతించకపోవడంతో పోలీసులు జోక్యం చేసుకుని బయటకు పంపించారు.2015 అక్టోబర్ 5న రైతుల రుణమాఫీ కోసం నిరసన చేసిన కాంగ్రెస్, టీడీపీ, బీజేపీ, సీపీఐ, సీపీఎం పార్టీలకు చెందిన 30 మంది ప్రతిపక్ష ఎమ్మెల్యేలను సస్పెండ్ చేశారు.2016 డిసెంబర్ 17న ఫిరాయింపులపై చర్చ కోరిన 9 మంది కాంగ్రెస్, 2 మంది టీడీపీ ఎమ్మెల్యేలు—మొత్తం 11 మందిని ఒకరోజు సస్పెండ్ చేశారు.2018 మార్చిలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలపై కఠిన చర్యలు తీసుకుని, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సంపత్‌కుమార్‌లను అనర్హులుగా ప్రకటించడంతో పాటు మరో 9 మందిని సస్పెండ్ చేశారు. 2020 మార్చి 7న భట్టి విక్రమార్క, శ్రీధర్‌బాబు, రాజగోపాల్‌రెడ్డి, జగ్గారెడ్డి, పొదెం వీరయ్య, సీతక్క సహా 6 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలను సస్పెండ్ చేసి, రాజగోపాల్‌రెడ్డిని మార్షల్స్ ద్వారా బయటకు తీసుకెళ్లారు.2022 మార్చి 7న రాజాసింగ్, రఘునందన్‌రావు, ఈటల రాజేందర్ అనే ముగ్గురు బీజేపీ ఎమ్మెల్యేలను బడ్జెట్ సమావేశాల మిగిలిన కాలానికి సస్పెండ్ చేసి, రాజాసింగ్‌ను మార్షల్స్ ద్వారా బయటకు పంపించారు.అంటే.అప్పుడు ప్రతిపక్షంపై చర్యలు తీసుకుంటే సభా నియమాలు.ఇప్పుడు తమపై చర్య వస్తే ప్రజాస్వామ్యంపై దాడినా?ప్రస్తుత ప్రభుత్వ చర్య తప్పయితే ప్రశ్నించే హక్కు బిఆర్ఎస్ కు ఉంది. కానీ నిన్నటి చరిత్రను మరిచి నేడు ప్రజాస్వామ్య పాఠాలు చెప్పే నైతిక హక్కు మాత్రం ముందుగా తమ గతానికి సమాధానం చెప్పిన తర్వాతే వస్తుంది.ప్రజాస్వామ్యం ఎవరి పార్టీ సొత్తు కాదు.నియమాలు అధికారపక్షానికైనా. ప్రతిపక్షానికైనా ఒకటే.

# ధ్యానంతో మానసిక ఆరోగ్యం

* **విద్యార్థులు ఏకాగ్రత పెంచుకునేందుకు లక్ష సాధనం ధ్యానం**



గరిడేపల్లి, ప్రజాస్ఫూర్తి : మండలంలోని పి.ఎం.శ్రీ గడ్డిపల్లి మోడల్ స్కూల్‌లో, పిరమిడ్ సొసైటీ సూర్యాపేట ఆధ్వర్యంలో ధ్యాన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ ధ్యానం ద్వారా శారీరక రుగ్మతలు దూరమై మానసిక ఆరోగ్యం, ప్రశాంతత మెరుగుపడుతుందని, విద్యార్థులు ప్రతిరోజూ ధ్యానం చేయాలని సూచించారు.చదువులో ఏకాగ్రత పెంచుకుని లక్ష్య సాధనకు ధ్యానం దోహదపడుతుందని తెలిపారు.ప్రిన్సిపాల్ డాక్టర్ జె. ప్రసన్నకుమారి మాట్లాడుతూ విద్యార్థులు ఒత్తిడిని అధిగమించి ఆరోగ్యంగా ఉండేందుకు శ్వాసపై ధ్యానాన్ని దినచర్యగా మార్చుకోవాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో నాగరాజు, సతీష్‌కుమార్, శైలజ, డాక్టర్ కందుల శివకృష్ణ, డాక్టర్ శ్రవణ్‌కుమార్, దామ్లా, వీరభద్రం, మల్లికార్జున్‌రెడ్డి, అనిల్, శ్రీను, నవాబ్, ప్రమీల శేఖర్, రాజేశ్‌తో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎస్సీ విభాగం ఆధ్వర్యంలో ఎర్రవల్లి ఫామ్ హౌస్ ముట్టడి



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పై ఎమ్మెల్సీ తాత మధు చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ టీపీసీసీ ఎస్సీ విభాగం పిలుపు మేరకు కేసీఆర్ ఎర్రవల్లి ఫామ్ హౌస్ ముట్టడికి వెళ్లిన మహబూబాబాద్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు తిప్పర్తి శ్రీధర్ ను పోలీసులు అరెస్టు చేసి జగదేవపూర్ పీఎస్ కు తరలించారు. అక్కడ డప్పులతో నిరసన కొనసాగించగా తోపులాటలో స్వల్ప గాయాలయ్యాయి. తర్వాత పూచీకత్తుపై విడుదల చేశారు.ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ స్పీకర్ పదవి అత్యంత గౌరవప్రదమైనదని, ఆ పదవిలో ఉన్న దళిత నేతపై కులపరమైన వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమన్నారు. తాత మధు తక్షణమే క్షమాపణ చెప్పి పదవి నుంచి బర్తరఫ్ కావాలని, శాసన మండలి నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ కూడా దళిత సమాజానికి క్షమాపణ చెప్పాలన్నారు.ఈ కార్యక్రమంలో శేషం కిరణ్,మీసాల సురేష్,పడిశాల జాన్ తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీని శాసనమండలి నుంచి భర్తరఫ్ చేయాలి



కేసముద్రం, మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధును శాసన మండలి సభ్యత్వం నుంచి తక్షణమే బర్తరఫ్ చేయాలని కేసముద్రం మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు సమ్మిగౌడ్ డిమాండ్ చేశారు.సోమవారం కేసముద్రం మండల కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్ వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలు నల్ల బ్యాడ్జీలు ధరించి, కాంగ్రెస్ జెండాలు, ప్లకార్డులతో నిరసన తెలిపారు. స్పీకర్ పదవిని, దళిత సమాజాన్ని కించపరచడం రాజ్యాంగ విలువలను అవమానించడమేనని నినాదాలు చేశారు.ఈ సందర్భంగా మండల అధ్యక్షులు సమ్మిగౌడ్ మాట్లాడుతూ ఉన్నతమైన రాజ్యాంగ పదవిలో ఉన్న స్పీకర్‌ను ఉద్దేశించి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు మాట్లాడిన తీరు అత్యంత హేయమైనది. రాజ్యాంగ వ్యవస్థలను, ప్రజాస్వామ్య పద్ధతులను కించపరిచే హక్కు ఎవరికీ లేదు.తాతా మధుపై తక్షణమే అనర్హత వేటు వేయాలి.ఈ కార్యక్రమంలో అంబటి మహేందర్ రెడ్డి,అల్లం నాగేశ్వరరావు, రావుల మురళి, బండారు వెంకన్న, కదిర సురేందర్, వల్లందాసు రవి, తరాల వీరేష్, రాంబాబు, రడెం వెంకన్న, రడెం శ్రీనివాస్, పోలెపాక నాగరాజు,ఆయూబ్ ఖాన్, శ్రీహరి, దామరకొండ ప్రవీణ్, సామల నరసయ్య, కొలిపాక వెంకన్న, వివిధ గ్రామాల సర్పంచ్ లు, గ్రామ పార్టీ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో ఘనంగా కేరళ తాంత్రిక అయ్యప్ప పూజా సమ్మేళనం



హైదరాబాద్, ప్రజాస్ఫూర్తి: కేరళ సంప్రదాయ తాంత్రిక విధానంలో అయ్యప్ప స్వామి పూజ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. సెప్టెంబర్ 6, 7 తేదీల్లో రెండు రోజుల పాటు నిర్వహించిన ఈ కార్యక్రమానికి అయ్యప్ప భక్తులు, సాధకులు, పూజా విధానాలను అభ్యసిస్తున్న వారు హాజరయ్యారు. గుండ్లపోచంపల్లిలోని ఏవీఆర్ కన్వెన్షన్ హాల్ వేదికగా కె. నిరంజన్ రావు గురూజీ పర్యవేక్షణలో నిర్వహించిన ఈ సమ్మేళనాన్ని కేరళలోని చెంగన్నూర్‌కు చెందిన మంత్ర విద్యా పీఠం వ్యవస్థాపకులు, తంత్ర గురువు బ్రహ్మ శ్రీ నంబూద్రి గురూజీ ఆధ్వర్యంలో జరిగింది. తొలిరోజు ప్రాయోగిక శిక్షణ, అయ్యప్ప సాధన చేశారు. రెండో రోజు మంత్రో అయ్యప్ప మంత్రోపదేశ మహోత్సవం ప్రధాన ఆకర్షణగా నిలిచింది. మంత్రోపదేశం అనంతరం గురు పాద పూజ, సన్మానం, సర్టిఫికెట్ల పంపిణీ కార్యక్రమాలు చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న సాధకులు, ఇతర ప్రముఖులకు జ్ఞాపికలను అందజేశారు. ఆధ్యాత్మిక సాధనకు సంబంధించిన సందేహాలు, పూజా విధానాలపై ప్రశ్నలు, ప్రత్యేక సందర్భాల్లో పూజా మార్గదర్శకత్వం, అయ్యప్ప పడి పూజకు సంబంధించిన అంశాలపై మార్గదర్శనం పొందే అవకాశం కల్పించినట్లు నిర్వాహకులు తెలిపారు.

# వినాయక ఉత్సవాలు సోదరభావంతో జరుపుకోవాలి

* చిగురుమామిడి ఎస్సై జగదీశ్వర్




చిగురుమామిడి, ప్రజాస్ఫూర్తి: వినాయక చవితి ఉత్సవాలను అన్ని వర్గాల ప్రజలు కలిసికట్టుగా, సోదరభావంతో, ప్రశాంతంగా జరుపుకోవాలని చిగురుమామిడి ఎస్సై పిలుపునిచ్చారు. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఆవరణలో మంగళవారం శాంతి కమిటీ సమావేశాన్ని ఎస్సై ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశానికి మండలంలోని అన్ని గ్రామాల నుండి వివిధ కులాల, మతాల పెద్దలు, యువకులుయూత్ సభ్యులు పెద్దసంఖ్యలోహాజరయ్యారు. ఈసందర్భంగా ఎస్సై మాట్లాడుతూ వినాయక మండపాల ఏర్పాటు విషయంలో నిర్వాహకులు పోలీసు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. మండపాల వల్ల రహదారులపై ట్రాఫిక్ కు, సామాన్య ప్రజలకు, అంబులెన్స్ ల రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలని స్పష్టం చేశారు. డీజే సౌండ్ ల విషయంలో నిబంధనలు పాటించాలని, రాత్రి వేళల్లో అధిక శబ్దం చేయరాదని సూచించారు. ముఖ్యంగా సోషల్ మీడియాను దుర్వినియోగం చేస్తూ, తప్పుడు వార్తలు, ఇతర మతాలను కించపరిచే విధంగా పోస్టులు పెట్టినా, వాట్సాప్ గ్రూపుల్లో ఫార్వర్డ్ చేసినా అలాంటి వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై గట్టిగా హెచ్చరించారు. ఎక్కడైనా ఏదైనా చిన్న గొడవ జరిగినా, అనుమానాస్పద వ్యక్తులు కనిపించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, ప్రజలంతా పోలీసులకు సహకరించి చిగురుమామిడి మండలంలో వినాయక చవితి వేడుకలను విజయవంతం చేయాలని ఎస్సై కోరారు. అత్యవసర సహాయం కోసం డయల్ 112 లేదా ఎస్సై నెంబర్ 8712670772 ను సంప్రదించాలన్నారు.

# దివిస్ సహకారం అభినందనీయం

- జై కేసారం ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత వైద్య శిబిరం
- సర్పంచ్ సమిరెడ్డి భారతమ్మ జనార్దన్ రెడ్డి




చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: విద్యార్థులు అనారోగ్యాల బారిన పడకుండా ముందస్తుగా దివిస్ పరిశ్రమ ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని సర్పంచ్ సమిరెడ్డి భారతమ్మ జనార్దన్ రెడ్డి అన్నారు. చౌటుప్పల్ మండలం జై కేసారం, అస్సోనిగూడెం గ్రామాల్లోని జిల్లా పరిషత్, ప్రాథమిక ప్రభుత్వ పాఠశాలల్లో దివిస్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సర్పంచ్ సమిరెడ్డి భారతమ్మ జనార్దన్ రెడ్డి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. వైద్యులు జయంత్ కుమార్, నరేష్ లు విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సుమారు 260మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అదేవిధంగా విద్యార్థులకు నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ స్వాతి వెంకటేష్, వార్డు సభ్యులు మణికంఠ చారి, చంద్రారెడ్డి, పుష్పలత జంగయ్య, స్వాతి బాలరాజు, గణేష్, జయసుధ జంగయ్య, తేజస్వి లింగారెడ్డి, దివిస్ పరిశ్రమ ప్రతినిధులు జి వెంకటేశ్వర్లు, జె శివకృష్ణ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

# ఈవీఎం గోడౌన్‌ను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి :త్రైమాసిక తనిఖీల్లో భాగంగా కలెక్టరేట్ దగ్గరలో ఉన్న ఈవీఎం గోడౌన్‌ను జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా గోడౌన్‌లోని స్ట్రాంగ్‌రూమ్ సీళ్లను క్షుణ్ణంగా పరిశీలించిన జిల్లా కలెక్టర్, ఈవీఎం గోడౌన్ భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా భద్రతా సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. భద్రతా సిబ్బంది షిఫ్టుల వారీగా కేటాయించిన విధులను సమయపాలనతో నిర్వహిస్తూ, గోడౌన్ భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని సూచించారు. గోడౌన్ నిర్వహణకు సంబంధించిన రికార్డులు, భద్రతా ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ అన్ని నిబంధనలను పకడ్బందీగా అమలు చేయాలని అధికారులకు తెలిపారు. ఈ తనిఖీలో రెవెన్యూ అదనపు కలెక్టర్ కె.అనిల్ కుమార్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నితీష్ కుమార్, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు పవన్ కుమార్, సంబంధిత అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# వినాయక నవరాత్రి ఉత్సవాలు శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలి

* జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్.



ప్రజాస్ఫూర్తి, నల్లగొండ : రానున్న వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు జిల్లాలో శాంతియుత వాతావరణం భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని ప్రజలకు ఇబ్బంది కలిగించే అధిక శబ్దం కలిగించే లౌడ్ స్పీకర్లు, డి.జె లకు అనుమతి లేదని జిల్లా ఎస్పీ శరత్చంద్ర పవర్ ఒక ప్రకటనలో తెలిపారు. డి.జే నిర్వాహకులు ఎట్టి పరిస్థితుల్లోనూ వినాయక మండపల వద్ద గాని ఊరేగింపులకు గాని డి.జేలు ఏర్పాటు చేయకూడదని అన్నారు. గణేష్ విగ్రహాల వద్ద నిర్వాహకులు స్పీకర్లను తక్కువ సౌండ్ తో రాత్రి 10గంటల వరకు మాత్రమే వినియోగించాలని, ఎవరైనా నిర్వాహకులు లౌడ్ స్పీకర్లు, డి.జె. సౌండ్ సిస్టమ్స్ ఏర్పాటు చేస్తే వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. అదే విధంగా పాఠశాలలు, కళాశాలలు, ఆసుపత్రులు, ప్రభుత్వ మరియు ప్రైవేటు కార్యాలయాలకు ఇతర ప్రార్థనా మందిరాలకు ఇబ్బంది కలిగేలా చేయరాదు అన్నారు. మండప నిర్వాహకులు ప్రజలకు వాహనదారులకు ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా విగ్రహాలను రోడ్డు కు ఇరుపక్కల ప్రతిష్టించుకోవాలనీ సూచించారు. సోషల్ మీడియాలో ఇతర మతాల వారి మనోభావాలు దెబ్బతీసే విధంగా పోస్టులు చేస్తే కఠిన చర్యలు తప్పవని సోషల్ మీడియా పై ప్రత్యేక మానిటరింగ్ సెల్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. మండప నిర్వహకులు అవసరమైన అన్ని శాఖల అనుమతులు తీసుకోవాలని కోరారు. వినాయక విగ్రహాల ఏర్పాటు చేయుటకు నిర్వాహకుల పోలీస్ పోర్టు నందు వివరాలు పొందుపరిచి అప్లికేషన్‌ను సంబంధిత పోలీస్ స్టేషన్‌లో అందజేయాలని సూచించారు. వినాయక ఉత్సవ కమిటీ నిర్వాహకులు పోలీసు వారి చూచనలు పాటిస్తూ సహకరించగలరని కోరారు.

* **గణేష్ మండప నిర్వాహకులు పాటించవలసిన నిబంధనలు:**

మండపం ఏర్పాటు చేయు స్థలం వారి యాజమానుల అనుమతులు తీసుకోవాలి. గణేష్ మండపాల కొరకు విద్యుత్ శాఖ వారి అనుమతితోనే కనెక్షన్ తీసుకోవాలన్నారు. షార్ట్ సర్క్యూట్ జరుగకుండా మంచి నాణ్యత గల వైరు ఉపయోగించాలన్నారు. గణేష్ మండపాల నిర్వాహకులు వారి మండపాల కమిటీ వివరాలు, మండపాల బాధ్యత వహించే వారి వివరాలు, ఫోన్ నెంబర్లను మండపంలో ఏర్పాటు చేయాలన్నారు. గణేష్ మండపాలను ఎవరికి ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా ఏర్పాటు చేసుకోవాలన్నారు. గణేష్ ప్రతిమలు కూర్చుండబెట్టే ప్రదేశంలో మంచి నాణ్యత గల స్టేజ్ , షెడ్ ఏర్పాటు చేయవలెను. గణేష్ మండపంలో 24 గంటలు ఇద్దరు వాలంటీర్ ఉండే విధంగా నిర్వహకులు తగు చర్యలు తీసుకోవాలి. గణేష్ మండపాలకు వచ్చే భక్తుల సందర్శన దృష్టిలో ఉంచుకుని, మండపాలలో భక్తుల కోసం క్యూలైన్లను ఏర్పాటు చేయడంతో పాటు వాలంటీర్లను నియమించాలన్నారు. గణేష్ మండపాల వద్ద మద్యం సేవించడం, పేకాట అడటం, అసభ్యకరమైన నృత్యాల ఏర్పాటు, అన్యమతస్తులను కించపరిచే విధంగా ప్రసంగాలు చేయడం, పాటలు పాడటంపై పూర్తిగా నిషేధం. విధిగా పాయింట్ పుస్తకం ఏర్పాటు చేసుకోవాలి, పోలీసు అధికారుల తనిఖీకి వచ్చినప్పుడు అందులో వ్రాసి సంతకం సూచనలు చేస్తారన్నారు. ప్రతి మండపం వద్ద సీసీ కెమెరాలు విధిగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. మండపాల్లో ఏదైనా అనుమానాస్పదంగా బ్యాగులు, ప్లాస్టిక్ సంచులు, వస్తువులు లేదా వ్యక్తులు కనిపించినట్లయితే తక్షణమే డయల్ 112 గాని లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలి. సామాజిక మాధ్యమాలలో వచ్చే ఎలాంటి రూమర్స్, వదంతులను నమ్మకూడదు, ఎవ్వరికైనా ఎలాంటి సందేహాలు ఉన్నా సంబంధిత పోలీసు వారికి లేదా డయల్ 112 కి సమాచారం అందించాలన్నారు.

# గోదావరి పుష్కరాలకు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలి

* రోజుకు 3 లక్షల మంది భక్తులకు సౌకర్యాలు కల్పించేలా ప్రణాళిక
* బాసర మాస్టర్‌ప్లాన్ పనులను వేగవంతం చేయాలి
* జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా




ప్రజాస్ఫూర్తి, భైంసా: రానున్న గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని బాసరతో పాటు జిల్లాలోని అన్ని పుష్కర ఘాట్ల వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. పుష్కరాల సందర్భంగా రోజుకు సుమారు 2.5 నుంచి 3 లక్షల మంది భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున, ఇప్పటి నుంచే శాఖల వారీగా సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించి, నిర్ణీత గడువులోగా పనులను పూర్తి చేయాలని సూచించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా ఎస్పీ జానకి షర్మిలతో కలిసి గోదావరి పుష్కరాల నిర్వహణ, బాసర నూతన ఆలయ నిర్మాణం, మాస్టర్‌ప్లాన్, ఇరిగేషన్ తదితర అంశాలపై వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, బాసర మాస్టర్‌ప్లాన్‌లో భాగంగా సుమారు రూ.354 కోట్ల విలువైన అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. పనులకు 30 నెలల కాంట్రాక్టు వ్యవధి ఉన్నప్పటికీ, పుష్కరాల ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని అత్యవసర, కీలక పనులను ఎనిమిది నెలల్లోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. భూసేకరణకు సంబంధించిన ప్రతిపాదనలను త్వరితగతిన పరిష్కరించి, తదుపరి ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. పుష్కరాలకు భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున తాగునీరు, మరుగుదొడ్లు, దుస్తులు మార్చుకునే గదులు, పార్కింగ్, రవాణా తదితర మౌలిక వసతులను అవసరమైన స్థాయిలో ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. రోజుకు మూడు లక్షల మంది భక్తులకు సరిపడేలా తాగునీటి సరఫరాకు ముందస్తు ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా అవసరమైన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు, బ్యాకప్ సదుపాయాలపై విద్యుత్ శాఖ అధికారులు సమగ్ర ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ ప్రాంతాల ఏర్పాటు, వాహనాల రాకపోకలకు ప్రత్యేక మార్గాలు, అవసరమైన చోట వన్‌వే, డైవర్షన్ తదితర అంశాలపై సమగ్ర ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు. బాసరతో పాటు జిల్లాలోని అన్ని పుష్కర ఘాట్ల వద్ద అత్యవసర వైద్య సేవలతో కూడిన వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, అవసరమైన వైద్య సిబ్బంది, మందులు, అంబులెన్స్‌లను ముందుగానే సిద్ధంగా ఉంచాలని సూచించారు. పుష్కరాల సమయంలో పారిశుద్ధ్య నిర్వహణకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. పంచాయతీల పరిధిలో పారిశుద్ధ్య ఏర్పాట్లను పటిష్టం చేయడంతో పాటు, పారిశుద్ధ్య సిబ్బంది, వాహనాలు, చెత్త తరలింపు తదితర అంశాలపై ముందస్తు కార్యాచరణ రూపొందించాలని సూచించారు. డీపీఓ, డీఎంహెచ్‌ఓలు పరస్పర సమన్వయంతో పనిచేసి పారిశుద్ధ్యం, ఆరోగ్య పరిరక్షణకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి ఆదేశాల మేరకు బాసరలోని అక్రమ, అనధికార నిర్మాణాలను గుర్తించి నిబంధనల ప్రకారం అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అవసరమైన ప్రాంతాల్లో నిర్మాణాల తొలగింపు, భూసేకరణ తదితర ప్రక్రియలను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. జిల్లా ఎస్పీ జానకి షర్మిల మాట్లాడుతూ, గోదావరి పుష్కరాల సందర్భంగా భక్తుల భద్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చే నేపథ్యంలో పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు, ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపడతామన్నారు. 24 గంటలపాటు ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టి, కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా నిరంతర నిఘా కొనసాగిస్తామని తెలిపారు. భక్తుల రద్దీ, వాహనాల రాకపోకలు, పార్కింగ్ తదితర అంశాలపై ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపడతామని చెప్పారు. బాసర నూతన ఆలయ నిర్మాణ పనులను ప్రణాళిక ప్రకారం వేగవంతంగా చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఆలయ నిర్మాణ పనులకు సంబంధించిన ప్రస్తుత స్థితి, ప్రతిపాదిత పనులు, భూసేకరణ, ఇరిగేషన్ తదితర అంశాలను అధికారులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్‌కు వివరించారు. అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ, పుష్కరాలకు వచ్చే భక్తులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన, పరిశుభ్రమైన వాతావరణం కల్పించేలా ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, భైంసా సబ్‌కలెక్టర్ అజ్మీరా సంకేత్‌కుమార్, ఏఎస్పీ సాయి కిరణ్, నీటిపారుదల, ఆర్‌అండ్‌బీ, ఆర్‌డబ్ల్యూఎస్, పీఆర్ ఈఈలు అనిల్, సుభాష్, సందీప్, బాసర ఆలయ ఈఓ అంజనా దేవి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# స్పీకర్ పై ఎమ్మెల్సీ తాతా మధు అనుచిత వ్యాఖ్యలు – తీవ్రంగా ఖండిస్తున్నాం

* టీపీసీసీ జనరల్ సెక్రటరీ నాగా సీతారాములు



ప్రజాస్ఫూర్తి , కొత్తగూడెం : కొత్తగూడెం నియోజకవర్గం లోని సుజాతనగర్ సెంటర్ నందు టిపిసిసి పిలుపుమేరకు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నర్రా అజయ్ కుమార్ ఆధ్వర్యంలో తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పై బిఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన టీపీసీసీ జనరల్ సెక్రటరీ నాగా సీతారాములు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళిత వర్గానికి చెందిన స్పీకర్ రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్నారని, అలాంటి గౌరవప్రదమైన పదవిలో ఉన్న వ్యక్తిపై అసభ్య పదజాలంతో మాట్లాడటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. రాజకీయ భేదాలు ఉండవచ్చు, ప్రభుత్వాన్ని విమర్శించవచ్చు, అయితే వ్యక్తిగత గౌరవాన్ని, స్పీకర్ పదవి ఔన్నత్యాన్ని కించపరిచేలా వ్యాఖ్యలు చేయడం ఏమాత్రం సమర్థనీయం కాదని , అసెంబ్లీలో టీషర్టులు విప్పి, బనియన్‌తో రావడం ద్వారా ప్రజలకు ఎలాంటి సందేశం ఇవ్వాలనుకుంటున్నారని ప్రశ్నించారు. ప్రజలకు ఆదర్శంగా నిలవాల్సిన ప్రజాప్రతినిధులే ఇలా వ్యవహరించడం సిగ్గుచేటని అన్నారు. ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అనుచిత వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకుని, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం సొసైటీ చైర్మన్ మండే వీరహనుమంతరావు తో పాటు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# చిగురుమామిడి మండలనికి 9 కోట్ల 62 లక్షలతో మంజూరు ఐనా తెలంగాణ పబ్లిక్ స్కూల్



చిగురుమామిడి, ప్రజాస్ఫూర్తి: కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండల కేంద్రంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ చిగురుమామిడి మండల కేంద్రంలో మంజూరు చేసినందుకు (న్ ఎస్ యూ ఐ)మండల అధ్యక్షులు పచ్చిమట్ల అజయ్ కుమార్ గౌడ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్వర్యంలో బాణసంచా కాలుస్తూ స్వీట్లు పంపిణీ చేసి ఘనంగా సంబరాలు జరుపుకున్నారు ఈ సంధర్భంగా అజయ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రజ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా విద్యార్థుల భవిష్యత్తు కోసం రాష్ట్రమంతటా అధునాతమైన విద్య అందిచిలే పేద పిల్లలకు భవిషత్తు కొరకై 1వ. తరగతి నుండి .12 వ.తరగతి వరకు ఒకే దగ్గర విద్య అందించేలా నిర్వహిస్తున్న ' తెలంగాణ పబ్లిక్ స్కూల్ (టీ జి పి స్ ) ' బీసీ,రవాణా శాఖ మంత్రి వర్యులు పొన్నం ప్రభాకర్ గారి ప్రత్యేక చొరవతో 9,62,00000 రూపాయల మంజూరు చేసి చిగురుమామిడి మండల కేంద్రంలో స్థాపించబోతునందుకు 17 గ్రామాల ప్రజలు విద్యార్థులు మంత్రి పొన్నం ప్రభాకర్ గారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా .హుస్నాబాద్ ఏ ఎం సి,చైర్మన్ కంది తిరుపతి రెడ్డి , కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు అందె సురేష్ ,గ్రామ సర్పంచ్ ఆకావరం భవాని శివప్రసాద్ ,మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎండీ కుత్బొద్దిన్,డీసీసీ కార్యదర్శులు సంబారి బాబు ,బదుకొలు దేవందర్ రెడ్డి , చిటుమళ్ళ రవీందర్ ,జిల్లా నాయకులు వంగర మల్లేశం , గోకురి మురారి రెడ్డి , షోశల్ మీడియా మండల కోఆర్డినేటర్ జిల్లెల్ల రమేష్ మండల సీనియర్ నాయకులు పుల లచ్చిరెడ్డి పోలు శ్రీనివాస్ , పచ్చిమట్ల జగన్ , ఒంటల రాజిరెడ్డి ,భగవాన్ ప్రసాద్, బొమ్మగాని వేంకటేశ్వర్ గౌడ్ , గ్రామ అధ్యక్షులు. వడియల సుధాకర్ రెడ్డి , కునా బాలయ్య వడియాల సంతోష్ రెడ్డి, శివంజనేయులు, గుడిసె అర్జున్ ,దంతనోజు కిషోర్ , కవ్వంపెల్లి సంజీవ్ సత్యనారయణ రెడ్డి ,దోమ తిరుపతి రెడ్డి,నరసింహ రెడ్డి, బలా కృష్ణచారి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు గ్రామస్తులు విద్యార్థులు పాల్గోన్నారు.

# నేలపట్ల చేనేత సొసైటీ మధ్యంతర స్టే, క్రిమినల్ ఆదేశాలను అమలు చేయాలి



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మండలం నేలపట్ల గ్రామ హ్యాండ్లూమ్ రివర్స్ కోఆపరేటివ్ సొసైటీకి నిర్వహించిన ఎన్నికల ఫలితాలపై ఆగస్టు 5వ తేదీన కోపరేటివ్ ట్రిబ్యునల్ కోర్టు ఇచ్చిన స్టే ఆర్డర్ ను అమలుపరచాలని చేనేత జౌళి శాఖ యాదాద్రి భువనగిరి జిల్లా సహాయ సంచాలకులు మంగళవారం నోటీసు జారీ చేశారు. ఈ మేరకు నేలపట్ల గ్రామంలోని చేనేత సొసైటీ భవనానికి నోటీసులను ఏడీవో గోపాల్ అంటించారు. నేలపట్ల చేనేత సొసైటీ అధ్యక్షునిగా ఎన్నికైన పిల్లలమరి శ్రీనివాస్ నియామకం చెల్లదని కొంతమంది డైరెక్టర్లు ఇటీవల సొసైటీ ట్రిబ్యునల్ కోర్టును ఆశ్రయించారు. పిల్లలమర్రి శ్రీనివాస్ కు ముగ్గురు సంతానం ఉన్నారని, సొసైటీ ఎన్నికల నియమావళి ప్రకారం ఇద్దరు కన్నా ఎక్కువ సంతానం కలిగిన వారు సొసైటీ ఎన్నికల్లో పోటీ చేయరాదు అనే నిబంధన మేరకు విచారించి, ఆగస్టు 5, 2026న పిల్లలమర్రి శ్రీనివాస్ ఎన్నిక, చైర్మన్ నియామకంపై మధ్యంతర స్టే ఉత్తర్వులు జారీ చేసిన విషయం విధితమే. స్టే ఆర్డర్ తో పాటు హ్యాండ్లూమ్స్, టెక్స్ టైల్స్ కమిషనర్ ఆదేశాల మేరకు మంగళవారం రోజు సొసైటీ భవనానికి నోటీసు అంటించారు. అదేవిధంగా పిల్లలమర్రి శ్రీనివాస్ కు సోషల్ మీడియా ద్వారా నోటీసు పంపించినట్లు చేనేత జౌళి శాఖ యాదాద్రి భువనగిరి జిల్లా ఏడిఓ గోపాల్ తెలిపారు. క్రిమినల్ కోర్టు నుంచి తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకు సొసైటీ లో మధ్యంతర స్టే ఆర్డర్ ఆదేశాలను న్యాయపరమైన ఇబ్బందులు లేకుండా వ్యవహరించాలని సొసైటీ కార్యదర్శి కి సూచించినట్లు పేర్కొన్నారు. ఆయనతో పాటు డైరెక్టర్లు గంజి శ్రీనివాసులు, తడక కోటేశ్వర్ పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్టు

## ఖండించిన బి.ఆర్.ఎస్ నాయకులు

ప్రజాస్ఫూర్తి సెప్టెంబర్ 8 జన్నారం, తెలంగాణ , బిఆర్ఎస్ ఎమ్మెల్యేపై జరిగిన దాడిని నిరసిస్తూ మంగళవారం రోజున ఖానాపూర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్య జాన్సన్ నాయక్ ఆధ్వర్యంలో చేపట్టనున్న నిరసన కార్యక్రమానికి బి.ఆర్.ఎస్ నాయకులు,కార్యకర్తలు వెళ్లకుండా పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు.ఈ సందర్భంగా బి.ఆర్.ఎస్ నాయకులు మాట్లాడుతూ ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలిపే హక్కును కూడా హరించే విధంగా ముందస్తు అరెస్టులు చేయడం సరైన చర్య కాదని అన్నారు.

# అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలి

* **జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి**



భువనగిరి, ప్రజాస్ఫూర్తి : మంగళవారం రాజాపేట మండలం బసంత్‌పూర్ గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి సందర్శించారు.ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రంలో పిల్లల హాజరు రిజిస్టర్ , గర్భిణీలు, బాలింతల వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.అంగన్వాడీ కేంద్రంలో ప్రస్తుతం ఎంత మంది చిన్నారులు ఉన్నారని , ఎంత మంది గర్భిణీలు, బాలింతలు ఉన్నారని వారికి ఎలాంటి పౌష్టికహారం ఇస్తున్నారని వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. చిన్నారులకు ప్రతిరోజూ అందిస్తున్న ఆహారం, పాలు, గుడ్లు తదితర పౌష్టికాహారంపై ఆరా తీశారు. గుడ్లకు సంబంధించిన నెలవారీ స్టాక్ సక్రమంగా వస్తుందా, పంపిణీ వివరాలు ఎలా ఉన్నాయనే విషయాలను పరిశీలించారు.అనంతరం చిన్నారులతో జిల్లా కలెక్టర్ ముచ్చటిస్తూ వారికి ఏ, బీ, సీ, డీ అక్షరాలను అడిగి తెలుసుకున్నారు. అంగన్వాడీలోని బొమ్మలను చూపిస్తూ వాటి పేర్లను పిల్లలను అడిగి తెలుసుకున్నారు. పిల్లల అభ్యసన స్థాయిని పరిశీలిస్తూ, వారికి అర్థమయ్యే విధంగా బోధన అందించాలని సంబంధిత అధికారులను సూచించారు. చిన్నారులకు తెలుగు భాషతో పాటు ఇంగ్లీష్ అక్షరాలు, పదాలను ప్రతిరోజూ ప్రాక్టీస్ చేయించాలని అంగన్వాడీ సిబ్బందికి కలెక్టర్ సూచించారు. ఆటలు, బొమ్మలు, వివిధ అభ్యాస కార్యక్రమాల ద్వారా పిల్లల్లో ఆసక్తిని పెంచుతూ ప్రాథమిక విద్యను బలోపేతం చేయాలని ఆదేశించారు.అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు పౌష్టికాహారం, ఆరోగ్య సంరక్షణతో పాటు నాణ్యమైన ప్రీస్కూల్ విద్య అందేలా సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ సూచించారు.ఈ కార్యక్రమం లో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# మీడియా పాయింట్ వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్సీల అరెస్ట్

* **ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి మరోసారి అరెస్ట్**



ప్రజాస్ఫూర్తి, షాద్నగర్ : శాసనమండలిలో సస్పెన్షన్‌కు గురైన ఇద్దరు బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు మీడియా పాయింట్ వద్ద సమావేశం నిర్వహించేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. శాసనమండలి పరిధిలో మీడియా సమావేశం నిర్వహించవద్దని పోలీసులు సూచించినప్పటికీ ఎమ్మెల్సీలు అక్కడే మాట్లాడేందుకు ప్రయత్నించడంతో వారిని పోలీసులు అరెస్టు చేశారు.పోలీసులు ఎమ్మెల్సీలను బలవంతంగా అదుపులోకి తీసుకుని అక్కడి నుంచి తరలించారు. ఈ ఘటనతో శాసనమండలి పరిసరాల్లో కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. మీడియాతో మాట్లాడేందుకు కూడా అవకాశం ఇవ్వకుండా అరెస్టు చేయడంపై బీఆర్ఎస్ వర్గాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఎమ్మెల్సీ నవీన్ రెడ్డిని పోలీసులు మరోసారి అరెస్టు చేసి బలవంతంగా పోలీస్ వాహనం ఎక్కించి తరలించడంతో కార్యకర్తలు అనుచరులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# కుంటాల టిపిఎస్ కు 9 కోట్లు మంజూరు చేయించిన ఎమ్మెల్యే




ప్రజాస్ఫూర్తి, భైంసా: నిర్మల్ జిల్లా కుంటాల మండల కేంద్రంలోని ఇది మన టీజీ మోడల్ స్కూల్ మరియు జూనియర్ కళాశాలలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ను ఏర్పాటు చేయాలని కుంటాల సర్పంచ్ జక్కుల గజేంధర్ అభ్యర్థన మేరకు ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ సానుకూలంగా స్పందించి ఇచ్చిన మాట ప్రకారం కుంటాలలో టిపిఎస్ స్కూల్ ను మంజూరు చేయించి 9కోట్ల రూపాయలు నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు, సర్పంచ్ జక్కుల గజేందర్ మాట్లాడుతూ తెలంగాణ పబ్లిక్ స్కూల్ ద్వారా మండలంలోని పేద విద్యార్థులకు ఉన్నత విద్యను పొందే అవకాశం ఉందని తెలియాజేశారు, ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పరికిపండ్ల వెంకటరమణ వార్డు సభ్యులు మాధవ్ రావు, వి డి సి గజ్జరం, న్యాకపు నరేందర్, బోనగిరి రాకేష్, ఆలూరి ప్రవీణ్, సుద్ధపు ముత్యం బిజెపి సీనియర్ నాయకులు కళ్యాణి గజేంధర్, తాటి శివ పాల్గొన్నారు.

# గాంధీనగర్ లో అభివృద్ధి పనులపై పర్యటించిన సీఎంసీ కమిషనర్

జగద్గిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : రంగారెడ్డి నగర్ డివిజన్ లోని గాంధీనగర్ లో గల సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ కమీషనర్ సృజన మంగళవారం పర్య టించారు. ఈ సందర్భంగా డివిజన్ పరిధి లో ఇంకా జరగాల్సిన అభివృద్ధి పనుల విషయమై డివిజన్ పరిధి నాయకులు, వివిధ కాలనీ ల సంక్షేమ సంఘం ప్రతినిధులు కమీషనర్ దృష్టికి తీసుకవచ్చారు. ఈ కార్యక్రమంలో స్వామి వివేకానంద అసోసియేషన్ అధ్యక్షులు జల్దా లక్ష్మీ నాద్, కుత్బుల్లాపూర్ అసెంబ్లీ కన్వీనర్ రంగా శ్రీనివాస్ గౌడ్, నారాయణ గౌడ్ శ్యామ్ అజ నరసింహ వివిధ బస్తీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అసెంబ్లీ స్పీకర్‌ను అవమానించిన బీ ఆర్ ఎస్ ఎమ్మెల్సీ తాతా మధును పార్టీ నుండి బర్తరఫ్ చేయాలి

* **ముస్తాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన**



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై బీ ఆర్ ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అవమానకర వ్యాఖ్యలను ఖండిస్తూ ముస్తాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గజ్జెల రాజు మాట్లాడుతూ, రాజ్యాంగ పదవిలో ఉన్న దళిత బిడ్డను లక్ష్యంగా చేసుకుని బీ ఆర్ ఎస్ నేతలు అవాస్తవాలు మాట్లాడటం వారి అహంకారానికి నిదర్శనమని ధ్వజమెత్తారు. దళితులు ఉన్నత స్థానాల్లో ఉండటాన్ని సహించలేకనే బీ ఆర్ ఎస్ నాయకులు ఇలాంటి దిగజడుదు రాజకీయాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. స్పీకర్ వ్యవస్థను కించపరిచేలా వ్యవహరించడం ప్రజాస్వామ్య వ్యవస్థకే పెనుముప్పని పేర్కొన్నారు. ఏళ్ల బాల్ రెడ్డి మాట్లాడుతూ, అసెంబ్లీ స్పీకర్ కుటుంబంపై అనుచిత విమర్శలు చేసిన తాతా మధును తక్షణమే బర్తరఫ్ చేయాలని, దళిత జాతికి బీ ఆర్ ఎస్ అధినేత బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కొండం రాజిరెడ్డి మాట్లాడుతూ, రాజ్యాంగ విరుద్ధంగా ప్రవర్తించే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. దళితుల ఆత్మగౌరవంపై దాడి చేస్తే కాంగ్రెస్ పార్టీ చూస్తూ ఊరుకోదని, ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, గ్రామ శాఖ అధ్యక్షులు, జిల్లా కార్యవర్గ సభ్యులు, మండల కార్యవర్గ సభ్యులు, యూత్ కాంగ్రెస్, ఎనఎస్యుఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆయుర్వేద వైద్యులంతా ఏకమవ్వాలి

* **భద్రాచలంలో ప్రారంభమైన మహాసభలు**
* **హాజరైన వివిధ రాష్ట్రాల ప్రతినిధులు**



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: వంశపారంపర్యంగా వైద్యం చేసే అందరూ ఏక తాటిపైకి నడిచి, ఆయుర్వేదాన్ని మరింత బలోపేతం చేయాలని పలువురు వక్తలు ఉద్ఘాటించారు.పారంపర్య వైద్య మహా సంఘం (పివిఎంఎస్) మూడవ రాష్ట్ర మహాసభలు భద్రాచలంలోని, భక్త మార్కండేయ భవన్లో మంగళవారం ప్రారంభమయ్యాయి.తొలుత మహా సభలకు ముందు ఆయుర్వేదానికి మూలపురుషుడైన ధన్వంతరిని స్మరించుకుంటూ, జ్యోతి ప్రజ్వలన గావించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ భారతీయ సనాతన ఆయుర్వేద సిద్ధ వైద్య విధానాలు మన దేశం అంతటా వేల సంవత్సరాల నుంచి విస్తరించి ఉన్నాయన్నారు. దేశం పట్ల, దేశ ప్రజల పట్ల, అంకితభావం కలిగిన వైద్యులను వెలికి తీయాల్సిన అవసరం ఉందని వక్తలు పేర్కొన్నారు. మరుగున పడిన వైద్య గ్రంథాలను వెలుగులోకి తీసుకొచ్చి, వైద్యులందరినీ ఏకతాటిపై నడిపించడమే మహాసభలు ఉద్దేశమని తెలియజేశారు. ఔషధము లేని వ్యాధి ఉండకుండా, అంటే ప్రతి వ్యాధికి ఔషధం ఉండే విధంగా రూపకల్పన చేయడమే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడిన వారిలో భారత ధర్మ దేవత బ్రహ్మచారి శ్రీ శ్రీ శ్రీ శివ స్వామి (శివ క్షేత్ర పీఠాధిపతి), మానవీయ వైద్య జమాల్ ఖాన్, రామదుగు వీరభద్ర చారి, పర్యావరణవేత్త మొక్కల వెంకటయ్యలతో పాటు ఆంధ్రప్రదేశ్, మదుర్రై, ఛత్తీస్గడ్, కేరళ, కర్ణాటక, ఒరిస్సా, తమిళనాడు లనుండి ప్రత్యేక ఆహ్వానితులు హాజరయ్యారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ సభలో రాష్ట్ర అధ్యక్షులు దొంత యాత్రి మహా ఋషి, ఉపాధ్యక్షులు ఆర్. శ్రీనివాస్, సిహెచ్ భాను ప్రసాద్, కోశాధికారి తోవేటి దుర్గారాణి, ఎస్కే వాహిద్ అలీ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కన్వీనర్, జి.సుగుణారావు, కొ కన్వీనర్ నాగేశ్వరరావు, తూము రమేష్, తదితరులు పాల్గొన్నారు. కాగా వేదిక మీద ఆసీనులైన వైద్యులకు ప్రకృతి ప్రేమికురాలు, హరిత దీక్షకురాలు చిన్నారి నైనిక రజవా మొక్కలను అందించి పలువురు ప్రశంసలు అందుకున్నారు. కాగా మహాసభలకు 500 రకాల ఔషధ మొక్కలను స్టాల్లో ఏర్పాటుచేసిన మొక్కల వెంకటయ్యను పలురు వైద్యుల అభినందించారు.

# గణేష్ మండపాల నిర్వాహకులు పోలీసు అనుమతులు తప్పకుండా తీసుకోవాలి

* **ఎస్సై శ్రీకాంత్ రెడ్డి**




వలిగొండ, ప్రజాస్ఫూర్తి : గణేష్ మండప నిర్వాహకులు పోలీసు ఇంకా ఇతర ప్రభుత్వ శాఖల ముందస్తు అనుమతులను తప్పకుండా తీసుకోవాలనివలిగొండ ఎస్సై శ్రీకాంత్ రెడ్డి అన్నారు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. వినాయక చవితి పండుగను ప్రజలందరూ ప్రశాంత వాతావరణంలో, భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ఆయనపిలుపునిచ్చారు.శాంతిభద్రతల పరిరక్షణ మరియు ప్రజల భద్రత దృష్ట్యా పలు సూచనలు జారీ చేశారు.

* **ముఖ్యమైన నిబంధనలు: ముందస్తు అనుమతి తప్పనిసరి**

గణేష్ మండపాలను ఏర్పాటు చేసే నిర్వాహకులు పోలీస్, విద్యుత్ శాఖ, మరియు మున్సిపల్/గ్రామ పంచాయతీ అధికారుల నుండి ముందస్తు అనుమతి పత్రాలను పొందాలి.ట్రాఫిక్ కు అంతరాయం కలగవద్దు: రోడ్లపై రాకపోకలకు ఇబ్బంది కలిగేలా, వాహనాల రాకపోకలను అడ్డుకునేలా మండపాలను ఏర్పాటు చేయకూడదు. డీజేలపై నిషేధం ధ్వని కాలుష్యం: రాత్రి వేళల్లో సుప్రీంకోర్టు నిబంధనల ప్రకారం నిర్దేశిత సమయం దాటిన తర్వాత మైకులు, ధ్వని కాలుష్య కారక పరికరాలను వాడకూడదు. డీజేల వాడకంపై కఠిన నిబంధనలు వర్తిస్తాయి.భద్రతా చర్యలు & సీసీ కెమెరాలు ప్రతి మండపం వద్ద నిర్వాహకులు స్వచ్ఛందంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి. రాత్రి వేళల్లో మండపం వద్ద కనీసం ఇద్దరు లేదా ముగ్గురు నిర్వాహకులు తప్పనిసరిగా కాపలా ఉండాలి. పోలీస్ స్టేషన్ నుండి తప్పకుండా అనుమతులు తీసుకోవాలని ఎస్సైతెలిపారు. శోభయాత్ర సమయములో ఎవరైనా శాంతి భద్రతలకి విఘాతం కలిగించినట్లయితే చట్టపరముగా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు.

# జిల్లా మహిళా సమాఖ్యను మరింత బలోపేతం చేయాలి

* **మహిళల ఆర్థిక స్వావలంబనకు స్వయం సహాయక సంఘాలు దోహద పడుతాయి అదనపు కలెక్టర్ భాస్కర్ రావు**




భువనగిరి, ప్రజాస్ఫూర్తి: యాదాద్రి భువనగిరి జిల్లా మహిళా సమాఖ్య 9వ సర్వసభ్య సమావేశం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సమాఖ్య కార్యవర్గంలోని రెండు ఖాళీ స్థానాలతో పాటు జిల్లా సమాఖ్య అధ్యక్షురాలి పదవికి ఎన్నికలు నిర్వహించారు. జిల్లా సమాఖ్య అధ్యక్షురాలిగా బీబీనగర్ మండల సమాఖ్య అధ్యక్షురాలు శ్రీమతి తిరునగరి ప్రజావాణి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్షురాలికి సమావేశానికి హాజరైన ప్రతినిధులు, అధికారులు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అదనపు కలెక్టర్ భాస్కర్ రావు మాట్లాడుతూ మహిళా సంఘాలను మరింత బలోపేతం చేయడంతో పాటు, స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళలకు మెరుగైన ఆర్థిక అవకాశాలు కల్పించాలని సూచించారు. మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించేలా జీవనోపాధి, స్వయం ఉపాధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని అన్నారు. మహిళా సంఘాల సభ్యులకు ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై అవగాహన కల్పిస్తూ, అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సహించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డిఆర్డిఓ నాగిరెడ్డి, అదనపు డిఆర్డిఓ జంగారెడ్డి, మందడి ఉపేందర్ రెడ్డి తదితరులు పాల్గొని నూతనంగా ఎన్నికైన జిల్లా సమాఖ్య అధ్యక్షురాలికి శుభాకాంక్షలు తెలిపారు. నూతనంగా ఎన్నికైన జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు తిరునగరి ప్రజావాణి మాట్లాడుతూ జిల్లా మహిళా సమాఖ్యను మరింత బలోపేతం చేసి, మహిళలకు ఆర్థిక అవకాశాలు, జీవనోపాధి, స్వయం ఉపాధి కల్పించడంతో పాటు సామాజిక సాధికారత దిశగా కృషి చేస్తానని తెలిపారు. ఈ సమావేశంలో డిపిఎంలు ప్రభాకర్, రవీందర్, ఎపీఎం లు రమణ, మల్లేశం, సీబీఓఎ లు మాధవి, బాలరాజు, జిల్లా సమాఖ్య అకౌంటెంట్ నాగలక్ష్మి పాల్గొన్నారు. అలాగే జిల్లాలోని అన్ని మండలాల మహిళా సమాఖ్య అధ్యక్షులు, కార్యదర్శులు, కోశాధికారులు సమావేశానికి హాజరయ్యారు.

## ఘనంగా మాజీ మున్సిపల్ చైర్మన్ స్వర్గీయ బి,లింగం గౌడ్ 12వ వర్ధంతి వేడుకలు

కుత్బుల్లాపూర్, ప్రజాస్ఫూర్తి : కుత్బుల్లాపూర్ మాజీ మున్సిపల్ చైర్మన్ స్వర్గీయ బి లింగం గౌడ్ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గౌరవ మాజీ కార్పొరేటర్ విజయ్ శేఖర్ గౌడ్ కుత్బుల్లాపూర్ లోని లింగం గౌడ్ ఘాట్ వద్ద, కుత్బుల్లాపూర్ మున్సిపల్ చౌరస్తాలో మరియు 127 డివిజన్ పరిధిలోని విజయ్ నగర్ కాలనీలో గల లింగం గౌడ్ గారి విగ్రహాలకు పూలమాలలు సమర్పించి నివాళులు అర్పించడం జరిగింది.. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు, వివిధ బస్తీల సంక్షేమ సంఘం నాయకులు, యువజన సంఘం నాయకులు, లింగం గౌడ్ కుటుంభసభ్యులు ,, వారి అభిమానులు తదితరులు పాల్గొన్నారు..

# బాల్య స్నేహానికి నిదర్శనం ఆపదలో ఉన్న మిత్రురాలిని ఆదుకున్న 200506 SSC బ్యాచ్



గరిడేపల్లి,ప్రజాస్ఫూర్తి : స్నేహానికి నిజమైన అర్థం చెప్పారు గరిడేపల్లి జెడ్పీహెచ్ఎస్ పూర్వ విద్యార్థులు. కలిసి చదువుకోవడమే కాదు, కష్టాల్లో ఆదుకోవడమే నిజమైన స్నేహమని నిరూపించారు. సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 200506 SSC బ్యాచ్ కు చెందిన విద్యార్థులు తమతో చదువుకున్న తోటి విద్యార్థిని మర్రి శ్రీదేవికి అండగా నిలిచారు.శ్రీదేవి గరిడేపల్లి జెడ్పీహెచ్ఎస్ లో పదవ తరగతి వరకు చదివి, దిర్శించర్ల గ్రామానికి చెందిన పంగ సైదులును వివాహం చేసుకున్నారు. ఎంతో ఆనందంగా,అన్యోన్యంగా సాగుతున్న వారి జీవితంలో అనుకోని దుర్ఘటన జరిగింది. భర్త సైదులు అకాల మరణం చెందడంతో ఆ కుటుంబం దిక్కుతోచని స్థితిలో పడింది.విషయం తెలుసుకున్న చిన్ననాటి స్నేహితులు చలించిపోయారు. తోటి మిత్రురాలికి ధైర్యం చెప్పి, తామున్నామనే భరోసా ఇచ్చారు. అందరూ తలా కొంత రూ. 22,500 నగదును సేకరించి, ఆమె కూతురు పేరు మీద డిపాజిట్ చేశారు.తమను మర్చిపోకుండా ఆపదలో ఆదుకున్న బాల్య మిత్రులకు శ్రీదేవి కృతజ్ఞతలు తెలిపారు. వారు అందించిన ఆర్థిక సాయాన్ని పిల్లల చదువులకు ఉపయోగిస్తానని తెలిపారు. కష్టకాలంలో ఆదుకున్న స్నేహితులను గ్రామస్తులు, ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో నకిరేకంటి రవి పిట్ట అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళా ఎమ్మెల్యేల పై దాడి అప్రజాస్వామికం

* **మహిళా ఎమ్మెల్యేలకు రక్షణ లేనప్పుడు సామాన్యుల పరిస్థితి ఏంటి**



ప్రజాస్ఫూర్తి , షాద్నగర్ : మహిళా ఎమ్మెల్యేలపై దాడి చేసే అధికారం ఎవరిచ్చారుని మాజీ మహిళా ప్రజాప్రతినిధులు, మహిళా కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకురాలు ప్రశ్నించారు. అసెంబ్లీ వద్ద మహిళ ఎమ్మెల్యేలపై జరిగిన దాడిని నిరసిస్తూ మాజీ ఎమ్మెల్యే వై అంజయ్య యాదవ్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమంలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళా ఎమ్మెల్యేల పై దాడి అప్రజాస్వామికమన్నారు.రాష్ట్రంలో మహిళా ఎమ్మెల్యేలకు రక్షణ లేనప్పుడు సామాన్యుల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. వెయ్యి రోజుల ప్రజాపాలనలో ప్రజల అవస్థలు పడుతున్నారని, ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధికి, ఇచ్చిన హామీలను అమలు చేయమని ప్రశ్నిస్తే దాడులు చేస్తారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళా ఎమ్మెల్యేలపై దాడి హేయమైన చర్య అని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మహిళా ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, నియోజకవర్గ బీఆర్ఎస్ శ్రేణులు పాల్గొన్నారు.

# కేజీబీవీ దేవరుప్పులకు రూ.56 లక్షలు

* **అదనపు తరగతి గదుల నిర్మాణానికి డి.ఎం.ఎఫ్.టి నిధులు, తక్షణమే పను లు ప్రారంభించాలని కలెక్టర్ ఆదేశం..**

దేవరుప్పుల/జనగామ, ప్రజాస్ఫూర్తి : దేవరుప్పుల కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో అదనపు త రగతి గదుల నిర్మాణానికి డి.ఎం.ఎఫ్ .టి నిధుల నుంచి రూ.56 లక్షలు మం జూరు చేస్తూ జిల్లా కలెక్టర్, జిల్లా విద్యా శాఖ అధికారి సందీప్‌కుమార్ ఝా, మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.ఇటీవల పాఠశాల సందర్శనలో విద్యార్థినులు సరిపడా తరగతి గదులు లేవని కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించగా, ఆ యన సానుకూలంగా స్పందించి అదన పు గదుల నిర్మాణానికి చర్యలు చేపట్టా రు. అసంపూర్తిగా ఉన్న మొదటి అంత స్తు ఎడమ, వెనుక భాగంలోని గదుల ను పక్కా నిర్మాణాలుగా పూర్తి చేయనున్నారు. టీజీఇడబ్ల్యూఐడీసీ వరంగల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ప నులను తక్షణమే ప్రారంభించి వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పా టించడంతో పాటు జియోట్యాగ్‌డ్ ప్రోగ్రె స్ ఫొటోలు, నాణ్యత తనిఖీలు నిర్వ హించి పురోగతి నివేదికలు అందజేయాలని అధికారులకు సూచించారు.

# ఆల్కహాల్‌పై కంట్రోల్ తప్పుతున్నారా?.!



మద్యం విపరీతంగా తాగడం వల్ల చాలా అనారోగ్య సమస్యలు వస్తాయని ఆరోగ్య నిపుణులు చెబుతుంటారు. అది మెదడును తీవ్రంగా ప్రభావితం చేస్తుందంటున్నారు. ఆల్కహాల్ వల్ల మెదడులోని ఐదు ముఖ్యమైన ప్రాంతాలు ప్రభావితమవుతున్నాయి. అవేంటో తెలుసుకుందాం.





### న్యూరో ట్రాన్స్ మీటర్ యాక్టివిటీ

న్యూరోట్రాన్స్‌మీటర్లు మెదడులోని నరాల సందేశాల మార్పిడిలో ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. ఆల్కహాల్ ఈ న్యూరోట్రాన్స్‌మీటర్ల పనితీరును మారుస్తుంది. ఇది ఆలోచనా శక్తిని తగ్గిస్తుంది.

### మెదడు నిర్మాణం

అతిగా మద్యం తాగడం వల్ల మెదడు నిర్మాణంలో మార్పులు వస్తాయి. ఇది మెదడు కణజాల పరిమాణాన్ని తగ్గిస్తుంది. ద్రవంతో నిండిన మెదడు జఠరికల పరిమాణాన్ని పెంచుతుంది. ఫలితంగా వ్యక్తి ఆలోచనా సామర్థ్యం బలహీనపడుతుంది. జ్ఞాపకశక్తి, ఏకాగ్రత, నిర్ణయం తీసుకోవడంలో ఇబ్బంది ఉంటుంది.

### న్యూరోకెమికల్ అసమతుల్యత

ఆల్కహాల్ ఎక్కువ తీసుకోవడం వల్ల న్యూరోట్రాన్స్‌మీటర్ల సున్నితమైన సమతుల్యత దెబ్బతింటుంది. ఈ అసమతుల్యత డిప్రెషన్, ఆందోళన వంటి మానసిక వ్యాధులకు దారితీస్తుంది. అలాగే ఇది స్వీయ నియంత్రణను తగ్గిస్తుంది.



### మెసోలింబిక్ మార్గం

ఆల్కహాల్ డోపమైన్ స్థాయిలను పెంచడం ద్వారా మెదడు మెసోలింబిక్ వ్యవస్థను సక్రియం చేస్తుంది. ఇది ఆనందం ఉద్దీపన అనుభూతిని కలిగిస్తుంది. కాలక్రమేణా ఈ రివార్డ్ మార్గాలు పదేపదే మద్యం తాగడంతో సున్నితంగా మారతాయి.

### మెదడు పనితీరు

ఆల్కహాల్ సమస్య పరిష్కారానికి తీసుకునే చర్యలను ప్రభావితం చేస్తుంది. ఇది సమస్యలను పరిష్కరించే సామర్థ్యాన్ని తగ్గిస్తుంది. రిస్క్ తీసుకునే ప్రవర్తనను పెంచుతుంది.

---

# పిల్లలు హైట్ పెరగాలంటే..

ప్రస్తుత జనరేషన్‌లో తల్లిదండ్రులు తమ పిల్లల గురించి చాలా శ్రద్ధ తీసుకోవాలి. వారు పుట్టినప్పటి నుంచి పెరిగేదాకా జాగ్రత్తగా గమనిస్తూ ఉండాలి. కొంతమంది పిల్లలు వయసుకు తగ్గట్లుగా హైట్ పెరగరు. దీనికి అనేక కారణాలు ఉంటాయి. ముందుగా పిల్లలకి సరైన పోషకాహారం లభిస్తుందో లేదో గమనించాలి. పోషక విలువలు అందించకపోతే బిడ్డ ఎదుగుదల ఆగిపోతుంది. ఈ రోజుల్లో పిల్లలు ఫాస్ట్, జంక్ ఫుడ్స్ తినడానికి ఇష్టపడుతున్నారు. కానీ ఇవి ఆరోగ్యానికి మంచిది కాదు. పిల్లలు హైట్ పెరగడానికి కొన్ని ఆహారాలు అందించాలి.








### పాలు

పాలలో అన్ని రకాల పోషకాలు ఉంటాయి. పాలు సంపూర్ణ ఆహారం అనడంలో ఎటువంటి సందేహం లేదు. ఇందులో ఉండే క్యాల్షియం, ప్రొటీన్ పిల్లల ఎముకలు, కండరాల అభివృద్ధికి తోడ్పడతాయి. పిల్లలకు ఉదయం సాయంత్రం పాలు తాగేలా చూసుకోవాలి.

### గ్రీన్ లీఫీ వెజిటబుల్స్

కొంతమంది పిల్లలు ఆకు కూరలు తినడానికి ఇష్టపడరు. బదులుగా ఆయిల్, జంక్ ఫుడ్‌ను ఇష్టపడతారు. తల్లిదండ్రులు పిల్లలకు ఆకుపచ్చ కూరగాయలను తినిపించడం చాలా ముఖ్యం. ఎందుకంటే ఇందులో ఐరన్, మెగ్నీషియం, ఫైబర్, ఫోలేట్, పొటాషియం, కాల్షియం, విటమిన్ ఎ, విటమిన్ సి, విటమిన్ కె ఉంటాయి. ఇవి పిల్లల ఎత్తును పెంచడంలో సాయపడుతాయి.

### పండ్లు

అన్ని వయసుల వారు పండ్లు తినమని సలహా ఇస్తారు. ఎందుకంటే ఇవి ఆరోగ్యానికి చాలా మంచివి. వీటిలో విటమిన్లు, ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి. ఈ రోజు నుంచే పిల్లలకు పండ్లు తినిపించడం అలవాటు చేయండి.

### గుడ్డు

గుడ్లలో ప్రొటీన్ అధికంగా ఉంటుంది. పిల్లలకు అల్పాహారంలో ఉడికించిన గుడ్లను తప్పక తినిపించాలి. ఇందులో ప్రొటీన్‌తోపాటు, పిండి పదార్థాలు, కాల్షియం పుష్కలంగా ఉంటాయి. ఇది శరీరం పెరుగుదలపై పాజిటివ్ ప్రభావాన్ని చూపుతుంది.

# లివర్ డ్యామేజ్ లక్షణాలు ఇవే..



లివర్ శరీరంలో అత్యంత ముఖ్యమైన అవయవం. బాడీలో జరిగే అన్ని పనుల్లో దీని సహకారం ఉంటుంది. ఇది శరీరంలోని మలినాలను బయటికి పంపిస్తుంది. అయితే కొన్ని కారణాల వల్ల లివర్ డ్యామేజ్ అవుతుంది. కానీ డ్యామేజ్ లక్షణాలు తొందరగా బయటపడవు. ఆలస్యంగా తెలియడం వల్ల అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోతుంది. ఆల్కహాల్ తాగేవారిలో లివర్ వ్యాధులు ఎక్కువగా వస్తాయనడంలో సందేహం లేదు. కానీ వైరల్ ఇన్ఫెక్షన్, ఊబకాయం, జన్యు కారణాల వల్ల కూడా లివర్ సమస్యలు ఏర్పడుతాయి. ఇలాంటి సందర్భంలో వాటిని ముందుగా గుర్తించడం అవసరం. అలాంటి వాటి గురించి ఈ రోజు తెలుసుకుందాం.

### మలం రంగులో మార్పు

మలం మట్టి రంగులో మారితే లివర్ పనిచేయడం లేదని అర్థం. సిర్రోసిస్ వంటి వ్యాధులలో లివర్ వాపునకు గురవుతుంది. ఇది పొట్ట విస్తరణగా కారణమవుతుంది. పాదాలు, చీలమండల వాపు కూడా సంభవిస్తుంది. లివర్ వ్యాధి ఉన్న రోగులకు చర్మం కింద పిత్త లవణాలు పేరుకుపోవడం వల్ల నిరంతర దురద ఉంటుంది. ఈ దురద ఎక్కడైనా రావచ్చు కానీ అరచేతులు, అరికాళ్లలో ఎక్కువగా వస్తుంది. ఇలాంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే డాక్టర్‌ని సంప్రదించి లివర్ టెస్ట్ చేయించుకోవాలి.

### అలసట, బలహీనత

నిరంతర అలసట, బలహీనత కాలేయ వ్యాధికి ప్రారంభ సంకేతాలు. ఇలాంటి సందర్భంలో వెంటనే డాక్టర్‌ని సంప్రదించాలి. పొట్ట పైభాగంలో నొప్పి లివర్ వాపునకు సంకేతం. ఈ నొప్పి తేలికపాటి నుంచి తీవ్రంగా మారుతుంది. కొవ్వు పదార్థాలు తిన్న తర్వాత మరింత పెరుగుతుంది. లివర్ సమస్యల వల్ల మూత్రం రంగు మారుతుంది. ఈ స్థితిలో మూత్రం రంగు టీ రంగు లేదా గోధుమ రంగులోకి మారుతుంది.



# MOVIE TIME



## అమ్ములు లుక్ ఇదే

మలయాళ భామ అనస్వర రాజన్ టాలీవుడ్‌లో వరుస సినిమాలతో దూసుకెళ్తోంది. ఇప్పటికే మూడు తెలుగు చిత్రాలకు సైన్ చేసిన ఈ బ్యూటీ.. తాజాగా నాలుగో సినిమాను ఓకే చేసింది. ఆమె కెరీర్‌లో ఇప్పటివరకు వచ్చిన అతిపెద్ద తెలుగు ప్రాజెక్ట్ మాత్రం మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న 'కాకా'. అనస్వర పుట్టినరోజు సందర్భంగా 'కాకా' చిత్రబృందం ఆమె ఫస్ట్ లుక్‌ను విడుదల చేసింది. ఇందులో ఎంబీబీఎస్ విద్యార్థిని అమ్ములుగా ఆమె కనిపించనుంది. సింపుల్ లుక్‌లో ఉన్న అనస్వర పాత్రను పోస్టర్‌లో ఆసక్తికరంగా పరిచయం చేశారు. ఆమె వెనుక నీడలో చిరంజీవి కనిపించడం సినిమాపై క్యూరియాసిటీని పెంచుతోంది. కథలో అమ్ములు జీవితంలో చిరంజీవి పాత్రకు ఉన్న ప్రాధాన్యాన్ని ఈ పోస్టర్ సూచిస్తోంది. 'కాకా'లో అనస్వర.. చిరంజీవి కుమార్తెగా నటిస్తోంది. ప్రస్తుతం హైదరాబాద్‌లో చిత్రానికి సంబంధించిన కీలక షెడ్యూల్ జరుగుతోంది. బాబీ కొల్లి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని కేవీఎన్ ప్రొడక్షన్స్ నిర్మిస్తోంది. 2027 జనవరి 13న సంక్రాంతి కానుకగా ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది.



## చెన్నై లవ్‌స్టోరీపై వైష్ణవి క్లారిటీ

కిరణ్ అబ్బవరం, శ్రీ గౌరీ ప్రియా జంటగా నటించిన రొమాంటిక్ డ్రామా 'చెన్నై లవ్‌స్టోరీ' మిక్స్‌డ్ రివ్యూస్ అందుకున్నప్పటికీ బాక్సాఫీస్ వద్ద క్లీన్ హిట్‌గా నిలిచింది. అయితే ఈ సినిమాలో తొలుత హీరోయిన్‌గా వైష్ణవి చైతన్యను ఎంపిక చేసిన విషయం తెలిసిందే. ఆ తర్వాత ఆమె స్థానంలో శ్రీ గౌరీ ప్రియా కథానాయికగా వచ్చింది. తాజాగా 'ఎపిక్' ప్రమోషన్స్‌లో భాగంగా వైష్ణవిని 'చెన్నై లవ్‌స్టోరీ' గురించి ప్రశ్నించగా.. ఈ విషయంపై ఆమె స్పష్టత ఇచ్చింది. 'అవును.. మొదట్లో నేను ఆ సినిమాలో భాగమే. అయితే, అదే సమయంలో మరో ప్రాజెక్ట్‌కు కమిట్ కావడంతో ఈ సినిమా చేయలేకపోయాను. సినిమా మంచి విజయాన్ని అందుకోవడం చాలా సంతోషంగా ఉంది. కొన్నిసార్లు వేరే ప్రాజెక్ట్‌కు కమిట్ అయి ఉండటం వల్ల కొన్ని సినిమాల్లో భాగం కాలేకపోతాం' అని చెప్పింది. దీంతో 'చెన్నై లవ్‌స్టోరీ' నుంచి వైష్ణవి తప్పుకోవడానికి ఇతర కారణాలేవీ లేవని, కేవలం డేట్స్ సమస్య కారణంగానే సినిమా చేయలేకపోయిందని స్పష్టమైంది. మరోవైపు తనకు వచ్చిన అవకాశాన్ని శ్రీ గౌరీ ప్రియా సద్వినియోగం చేసుకుని ఈ రొమాంటిక్ డ్రామాతో మంచి విజయాన్ని అందుకుంది.



## జీ2కి మాళవిక నో.. వామికా ఓకే..!

అడివి శేష్ స్పై థ్రిల్లర్ 'G2'లో వామికా గబ్బి కీలక పాత్రలో నటిస్తున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాతోనే ఆమె టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇస్తోంది. అయితే వామికా పోషిస్తున్న పాత్ర కోసం చిత్రబృందం తొలుత మాళవిక మోహనన్‌ను సంప్రదించిందట. ఇప్పటికే మరో స్పై థ్రిల్లర్ 'సర్దార్ 2'కు కమిట్ కావడంతో మాళవిక ఈ ఆఫర్‌ను తిరస్కరించినట్లు అడివి శేష్ వెల్లడించారు. 'జీ2'.. అడివి శేష్ నటించిన సూపర్‌హిట్ 'గూఢచారి'కి నేరుగా సీక్వెల్‌గా తెరకెక్కుతోంది.



## బ్యాడ్‌ఫేజ్‌లో ప్రియాంక!

టాలీవుడ్, కోలీవుడ్‌లో మోస్ట్ వాంటెడ్ హీరోయిన్లలో ఒకరిగా వరుస అవకాశాలు అందుకున్న ప్రియాంక మోహన్ ప్రస్తుతం కెరీర్‌లో కాస్త డల్‌ఫేజ్‌ను ఎదుర్కొంటుందా? అంటే సోషల్ మీడియాలో జరుగుతున్న చర్చలు అవుననే అంటున్నాయి. తాజాగా ఏజీఎస్ ప్రొడక్షన్స్ 29వ చిత్రంలో హీరో జై సరసన ప్రియాంక నటించనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. దీంతో ఆమె కెరీర్‌పై నెట్టింట చర్చ మొదలైంది. గతేడాది పవన్ కల్యాణ్ 'దే కాల్ హిమ్ ఓజీ'లో కనిపించిన ప్రియాంక.. ఆ తర్వాత 'మేడ్ ఇన్ కొరియా'లో నటించింది. ప్రస్తుతం కవిన్ 'కే09', మారి సెల్వరాజ్ 'మంజనత్తి'లో కనిపించనుంది. జై వంటి హీరోతో సినిమా చేయడం ఆమె స్థాయికి తగ్గ సినిమా కాదంటూ పలువురు అభిమానులు కామెంట్లు చేస్తున్నారు. శింబు 'అరసన్'లో ప్రియాంక నటిస్తున్నట్లు కోలీవుడ్‌లో ప్రచారం జరుగుతోంది. ఈ చిత్రాలతో సక్సెస్ సాధించి ఈ బ్యూటీ మళ్లీ ఫామ్‌లోకి వస్తుందేమో చూడాల్సిందే.



## రవితేజ మేనల్లుడి మూవీకి 'ఏ' సర్టిఫికెట్

మాస్ మహారాజా రవితేజ మేనల్లుడు మాధవ్ భూపతిరాజు హీరోగా తెరకెక్కిన చిత్రం 'మరెమ్మ'. మంచాల నాగరాజ్ దర్శకత్వం వహించిన ఈ రూరల్ డ్రామా సెప్టెంబర్ 10న థియేటర్లలోకి రానుంది. ఇప్పటికే విడుదలైన ట్రైలర్ సినిమాపై ఆసక్తిని పెంచింది. తాజాగా ఈ సినిమాకు సెన్సార్ బోర్డు 'ఏ' (A) సర్టిఫికెట్ జారీ చేసినట్లు మేకర్స్ ప్రకటించారు. సినిమాలోని గ్రిటీ కంటెంట్ తీవ్రత కారణంగానే అడల్ట్ సర్టిఫికేషన్ వచ్చినట్లు తెలుస్తోంది. 'మరెమ్మ'లో మాధవ్ భూపతిరాజు సరసన దీపా బాలు హీరోయిన్‌గా నటించారు.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.